



పెందుర్తి మండలం పినగాడిలో నీట మునిగిన వరి పంట

భూముల విలువ సవరణ

ఒకటో తేదీ నుంచి అమలుకు రంగం సిద్ధం

- జాయింట్ కలెక్టర్ కమిటీకి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదనలు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో ప్రదర్శన
- అభ్యంతరాలు ఉన్నట్టయితే రెండు రోజుల్లోగా రాత పూర్వకంగా తెలియజేయాలి
- రిజిస్ట్రేషన్ వాల్యూ, మార్కెట్ రేటుకు ఎక్కువ తేడాలున్న చోట 50 శాతం వరకూ పెంపు
- వుడా రెవెన్యూ లేఅవుట్‌లో 22 శాతం



- ఎంవీపీ సిటీలో 10 శాతం
- బక్కన్నపాలెం 20 శాతం
- ఒమ్మివానిపాలెం 67 శాతం
- సాయిప్రియా లేఅవుట్ 26 శాతం
- అక్కయ్యపాలెంలో 9 శాతం
- కాపులుప్పాడలో 19 శాతం
- ముడసర్లోవ ప్రాంతంలో 43 శాతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ జిల్లాలో భూముల విలువల సవరణకు జాయింట్ కలెక్టర్ కమిటీకి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర ప్రభుత్వం జనవరి ఒకటో తేదీ నుంచి కొత్త రేట్లు అమలులోకి తేవాలని ఆదేశించడంతో ప్రతి గ్రామం తిరిగి ధరలు, అక్కడి అభివృద్ధి పరిశీలించారు. ఆ మేరకు రెవెన్యూ, జీవీఎంసీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కలిసి కొత్త ధరలు ప్రతిపాదించారు. ఎక్కడైతే కొత్తగా లేఅవుట్లు, నిర్మాణాలు వస్తున్నాయో అక్కడ మార్కెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని రేట్లు నిర్ణయించారు. వీటిని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో రాతపూర్వకంగా సబ్ రిజిస్ట్రార్‌కు తెలియజేయాలి. జిల్లా కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారు. జిల్లాలోని అన్ని కార్యాలయాల నుంచి అందిన ప్రతిపాదనలు పరిశీలిస్తే అత్యల్పంగా ఐదు శాతం అత్యధికంగా 131 శాతం విలువలను సవరించారు.

ఆనందపురం మండలం శిర్లపాలెంలో గజం భూమి ప్రభుత్వ ధర (రిజిస్ట్రేషన్ వాల్యూ) కేవలం రూ.650 మాత్రమే ఉంది. మార్కెట్ విలువ రూ.2 వేలు ఉంది. దానిని ఇప్పుడు రూ.1,500 చేశారు. శాతంలో చూసుకుంటే మాత్రం 131శాతం పెంచినట్టు కనిపిస్తోంది. అదే అక్కయ్యపాలెం, నరసింహనగర్, అబిద్ నగర్‌లను తీసుకుంటే ప్రభుత్వ ధర గజం రూ.70 వేలు ఉండగా, మార్కెట్‌విలువ రూ.1.25 లక్షలు ఉంది. దీనిని ఇప్పుడు 9 శాతం అంటే రూ.6 వేలు పెంచి రూ.76 వేలు చేశారు.

- అడవివరం సింహగిరి కాలనీలో గజం ప్రభుత్వ ధర రూ.20 వేలు కాగా మార్కెట్ విలువ రూ.38,500 ఉంది. దీనిని 15 శాతం పెంచి రూ.23 వేలు చేశారు.
- నాయుడుతోటలో గజం రూ.24 వేలు కగా మార్కెట్ రేటు 45 వేలు ఉంది. దీనిని 12.5 శాతం పెంచి రూ.27 వేలు చేశారు.
- చీమలాపల్లిలో గజం రూ.12 వేలు కాగా మార్కెట్ విలువ రూ. 22,500 ఉంది. దానిని 12.5 శాతం పెంచి

... మిగతా 6వ పేజీలో

ముసురు

నగరంలో తెరిపివ్వని వాన
లోతట్టు ప్రాంతాలు జలమయం

- బిక్కుబిక్కుమంటున్న కొండవాలు ప్రాంతాల ప్రజలు
- అత్యధికంగా కాపులుప్పాడలో 43.75 మి.మీ.వర్షపాతం నమోదు
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- కెరటాల తాకిడికి గోకుల్ పార్కు వద్ద కూలిన రక్షణ గోడ



గోకుల్ పార్కు సమీపంలో కోతకు గురైన తీరం

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం (సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది) ప్రభావంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకూ దఫదఫాలుగా వర్షం కురుస్తూనే ఉంది. శీతాకాలం...అందునా మూడు రోజులుగా ముసురు పట్టడంతో వాతావరణం చల్లగా మారింది.

నగరంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజల దైనందిన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలు, దుకాణాలకు వెళ్లే ఉద్యోగులు, సిబ్బంది తడిసిపోయారు. వర్షానికి నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు పొంగడంతో చెత్తంతా రోడ్ల పైకి చేరింది. గురువారం ఉదయం ఎనిమిది నుంచి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల వరకూ జిల్లాలోని కాపులుప్పాడలో 43, గంభీరంలో 38.5, గోస్తనీ పంప్‌హౌస్, మధురవాడల్లో 38 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ కాపులుప్పాడలో 43.75, గంభీరంలో 40.5,పెందుర్తిలో 37 మి.మీ. నమోదైంది. కాగా గత రాత్రి నుంచి వర్షం పెరగడం తో కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఏ క్షణంలో రాళ్లు, మట్టి జారిపడతాయోనని ఆందోళన వ్యక్తం



చేస్తున్నారు.

గోకుల్ పార్కు వద్ద కూలిన.. రక్షణ గోడ

తీవ్ర వాయుగుండంతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. అలలు పెద్దఎత్తున ఎగసిపడుతూ తీరం దిశగా వస్తున్నాయి. దీంతో ఆర్కే బీచ్‌కు దక్షిణాన గోకుల్ పార్కు వద్ద రక్షణ గోడ శుక్రవారం ఉదయం కూలిపోయింది. ఇంకా వరుణ్ చిల్డ్రన్ పార్కు వద్ద కొంత గోడ దెబ్బతింది. గడచిన వారం రోజులుగా అలల ఉధృతికి కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం వెనుక రక్షణ గోడ దెబ్బతింది. వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకూ తీరం ఎక్కడికక్కడ కోతకు గురికావడంతో సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో పద్మనాభం, ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాల్లో కోసిన వరి పంట నీట మునిగింది. పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు తీరని నష్టం మిగిల్చాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ బడ్జెట్

రూ.4,554.27 కోట్లు

- నేడు స్టాండింగ్ కమిటీ ముందుకు ముసాయిదా
- ఆమోదం పొందితే కౌన్సిల్‌కు...
- అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి రూ.1,286.5 కోట్లు కేటాయింపు
- ప్రజారోగ్య విభాగానికి 459.49 కోట్లు
- ప్రాజెక్టులకు రూ.808.14 కోట్లు, రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారుల అంచనా



విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26) రూ.4,554.27 కోట్లతో జీవీఎంసీ అధికారులు బడ్జెట్‌ను తయారుచేశారు. ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ముసాయిదాను ఆమోదించడంతో శనివారం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి పంపించబోతున్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ముసాయిదాపై సభ్యులు చర్చించిన తర్వాత ఏమైనా సవరణలు చేయాలా?, ఆమోదించాలా? అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు. స్టాండింగ్ కమిటీ ఆమోదిస్తే తర్వాత కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ముసాయిదాను ప్రవేశపెడతారు.

2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌తో పోల్చితే రూ.ఆరు కోట్లు తగ్గించి రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముసాయిదాను తయారుచేశారు. కొత్త బడ్జెట్‌లో అత్యధికంగా ఇంజనీరింగ్ విభాగానికి రూ.1,286.5 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి 459.49 కోట్లు, ప్రాజెక్టులకు రూ.808.14 కోట్లు, లైటింగ్‌కు రూ.116.15 కోట్లు, టౌన్‌ప్లానింగ్‌కు రూ.31.99 కోట్లు, యూసీడీ విభాగానికి రూ.27.54 కోట్లు, పార్కులకు రూ.71.42 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.338.93 కోట్లు, అమృత్ పథకానికి రూ.310 కోట్లు, ఇతర నిధులతో చేపట్టే ప్రాజెక్టులకు రూ.148 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా చేపట్టే పనులకు రూ.453.2 కోట్లు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ముగింపు నిల్వ కింద రూ.154.88 కోట్లు చూపించారు.

జీవీఎంసీకి వచ్చే ఆదాయాన్ని పరిశీలిస్తే సాధారణ పద్దు కింద రూ.1,076.71 కోట్లు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.503.31 కోట్లు,

... మిగతా 6వ పేజీలో

విశాఖను కలుపుతూ టూరిజం సర్క్యూట్

- పర్యాటక ఉత్సవాల తేదీలు త్వరలో ఖరారు
- పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి)



మంత్రి కందుల దుర్గేశ్

విశాఖ పరిసర ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఒకటి అభివృద్ధి చేస్తున్నామని, అది కొద్దికాలంలో అందుబాటులోకి వస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక శాఖ నిర్వహించే ఉత్సవాల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఎక్కడెక్కడ ఏ తరహాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలనే అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. రుషికొండపై మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యాటక శాఖ నిధులతో నిర్మించిన భవనాన్ని ఏ విధంగా ఉపయోగించుకోవాలనే దానిపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. తెన్నేటి పార్కు వద్ద సముద్ర తీరాన చిక్కుకుపోయిన బంగ్లాదేశ్ నౌక ఎంవీ మాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆ స్థలం అటవీ శాఖ పరిధిలో ఉన్నందున కొన్ని అనుమతుల కోసం వేచిచూస్తున్నామని వివరించారు.

వైసీపీకి వరుస షాక్‌లు

పార్టీని వీడుతున్న ముఖ్య నేతలు

- వారం కిందట మాజీ మంత్రి ముత్తంశెట్టి...
- ఇప్పుడు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్
- అసంతృప్తితో మరికొందరు నేతలు



ఆడారి ఆనంద్‌కుమార్



ముత్తంశెట్టి శ్రీనివాస్

- తరువాత వంతు ఎవరిదనే చర్చ
- పార్టీ కార్యక్రమాలకు మాజీ ఎంపీ ఎంవీవీ, డీసీసీబీ మాజీ చైర్మన్ కోలా గురువులు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీవీ దూరం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ముఖ్య నేతలు ఝలక్ ఇస్తున్నారు. ఒకరి తర్వాత ఒకరు పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారం కిందట పార్టీకి రాజీనామా చేయగా, శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. మరికొందరు నేతలు కూడా అదేదారిలో ఉన్నారనే ప్రచారం ఆ పార్టీ నేతలను కలవరపరుస్తోంది.

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ పరిస్థితి దారుణంగా తయారైంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చురుగ్గా ఉన్నవారంతా ప్రస్తుతం సైలెంట్ అయిపోయారు. కొంతమంది పార్టీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తుంటే, మరికొందరు ముఖ్య నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు పెద్దగా స్పందన కనిపించడం లేదు. రైతుల సమస్యలపై ఈనెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు వైసీపీ అధినేత పిలుపునిచ్చారు. సరిగ్గా ఆ కార్యక్రమం జరగడానికి ముందురోజు మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పార్టీని వీడుతున్నట్టు ప్రకటించారు. ఈ పరిణామం ఆ పార్టీలో అసంతృప్తితో ఉన్నవారితోపాటు కార్యక్రమాలకు హాజరవ్వడంపై తర్జన భర్జనపడుతున్న నేతలపై ప్రభావం చూపింది. మరుసటిరోజు (13న) జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు కలిపినా 150 మంది కనిపించలేదు. పార్టీ అధ్యక్షుడి పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపట్టేందుకు నాయకులు వారం ముందు నుంచి సన్నాహాలు చేసినా కనీసం 150 మందిని

... మిగతా 6వ పేజీలో

రవాణా మంత్రి తనిఖీలు



పాడేరు బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాదరెడ్డి

రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాదరెడ్డి శుక్రవారం నగర పర్యటనకు వచ్చారు. ఆర్టీసీ కార్గోలో బుక్ చేసే పార్శిళ్లను డోర్ డెలివరీ చేసే సదుపాయాన్ని ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆయన ప్రారంభించారు. అంతకుముందు మంత్రి కాంప్లెక్స్‌లో ప్లాట్‌ఫారంపై నిలిపి ఉన్న పాడేరు బస్సు ఎక్కి ప్రయాణికులతో మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి కాంప్లెక్స్ ఆవరణలోని హోటళ్లు, దుకాణాలకు వెళ్లి అక్కడ పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఒక హోటల్‌లో దోశ రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. మంత్రి వెంట ఆర్టీసీ జోన్-1 చైర్మన్ దొన్ను దొర, ఇన్‌చార్జి రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

- విభాగాల అధిపతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని మేయర్‌ను కోరిన స్టాండింగ్ కమిటీ సభ్యులు
- తాత్కాలిక కార్మికులకు వేతనాలు చెల్లించే స్వయం సంఘాలకు రెండు శాతం కమీషన్ ఎందుకిస్తున్నారని నిలదీత
- ఐదారు మినహా 69 అంశాలకు ఆమోదం



మేయర్ అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి):

స్టాండింగ్ కమిటీ సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై ఎజెండాలో పొందుపరిచే అంశాలకు సంబంధించిన విభాగాల అధిపతులు సమావేశానికి తప్పనిసరిగా హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని మేయర్‌ను కోరారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. జోన్-5, జోన్-6 పరిధిలో రోడ్లను శుభ్రపరిచేందుకు తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకున్న కార్మికులకు వేతనాల చెల్లింపు, మరో 30

... మిగతా 6వ పేజీలో

అప్పన్నను దర్శించుకున్న ఐటీ ట్రైబ్యునల్ న్యాయమూర్తి



సింహాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామిని ఆదాయ పన్ను శాఖ అప్పి లేట్ ట్రైబ్యునల్ గౌరవాధ్యక్షుడు, న్యాయమూర్తి సీవీ భడాంగ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు సహాయ కార్యనిర్వాహణాధికారి నక్కాన ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తి గోత్రనామాలతో అంత రాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత వేదపండితులు ఆశీర్వచనాలీయగా అధికారులు శాలువతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

నేడు రక్తదాన శిబిరం

పద్మనాభం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పద్మనాభంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ కె. రాంబాబు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం వారు ప్రకటన విడుదల చేశారు. శిబిరంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

గోదాదేవికి పాశురాం నీరాజనాలు



సింహాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి శుక్రవారం పాశుర నీరాజనాలు అర్పించారు.వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపిన తరువాత ఉత్సవ మూర్తిని గోదాదేవిగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పల్లకిలో ఉంచి ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, అధ్యాపకులు వేదపారాయణలు నడుమ బేడా మండప తిరువీధి నిర్వహించారు. తరువాత గోదాదేవి సన్నిధిలో స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో పండితులు గోదాదేవి రచించిన తిరుప్పావై లోని ఐదవ పాశురాన్ని విన్నపం చేశారు.

వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

భీమునిపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటగిరిపై ఉన్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 13 వరకూ ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 31న అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారికి సప్త హారతులు, నవనీత సేవ, 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11న కూడారై ఉత్సవం, 12న నిరాటోత్సవం, 13న గోదా రంగనాథుల కల్యాణం జరుగుతుందన్నారు.

'హైందవ శంఖారావం సభకు తరలిరండి'

పద్మనాభం రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశ్వ హిందూ పరిషత్ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో వచ్చేనెల 5న విజయవాడలో జరగనున్న భారీ బహిరంగ సభను హిందువులు విజయవంతం చేయాలని స్థానిక విశ్వ హిందూ పరిషత్ ప్రముఖ్ గాడు వెంకటనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ చలో విజయవాడకు తరలిరావాలన్నారు.

కమనీయం సింహాద్రినాథుని నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు పూర్తిచేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గణిత దినోత్సవం

సాగర్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గణిత శాస్త్రవేత్త శ్రీనివాసా రామానుజం జయంతి పురస్కరించుకుని గీతం వర్సిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన శివనాడార్ విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యంనారాయణరెడ్డి మాట్లాడుతూ రామానుజం గణిత శాస్త్రంలో చేసిన అపార కృషి ప్రపంచ వ్యాప్తంగా గణితాన్ని సరికొత్త దశలో నిలిపిందన్నారు. కంప్యూటర్ నుంచి అంతరిక్ష శాస్త్రం వరకు అన్ని రంగాల్లోనూ గణిత శాస్త్రం ప్రాధాన్యత కలిగి ఉందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, గణితశాస్త్ర విభాగం అధి పతి డాక్టర్ వి. శిరీష, తదితరులు పాల్గొన్నారు.



భీమిలిలో కొనుగోలుదారులు లేక బోసిపోయిన మార్కెట్



పాండ్రంగిలో వరి కుప్పలపై వేసిన టార్పాలిన్లను పరిశీలిస్తున్న ఏఓ చలం

స్తంభించిన జన జీవనం

- నియోజకవర్గంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు
- బోసిపోయిన వ్యాపారాలు
- నిర్మానుష్యంగా తీర ప్రాంత గ్రామాలు
- రాకపోకలకు విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలు

భీమునిపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలో జన జీవనం స్తంభించింది. వర్షాలకు తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ప్రజలు వణికిపోతున్నారు. నిత్యం రద్దీగా వుండే భీమిలి మెయిన్ రోడ్ శుక్రవారం నిర్మానుష్యంగా మారింది. ప్రజలు అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వస్తున్నారు. బీచ్‌రోడ్‌లో ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలోనూ, హ్యాంగోవర్ హౌస్ వద్ద నీరు నిలిచిపోయింది.గంట స్తంభం జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌లో వ్యాపారులు షాపులు మూసి వేశారు. కొందరు వర్షంలో తడుస్తూనే అమ్మకాలు చేశారు.

మధురవాడ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మధురవాడ పరిసరాల్లో జన జీవనం స్తంభించింది. రోజువారీ కూలీలు ఉపాధి కోల్పోయారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసేవారు ఇళ్లకు పరిమితమయ్యారు. ప్రతిరోజూ కొమ్మాది కూడలి, మిథిలాపురి వుడా కాలనీ, మధురవాడ జంక్షన్, శివశక్తి నగర్ రోడ్ ప్రాంతాల్లో వందల సంఖ్యలో వలస కూలీలు ఉదయం 6 గంటలకు క్యారేజీలు పట్టుకొని పనులకు పిలిచే వారి కోసం ఎదురుచూస్తుంటారు. మూడు రోజులుగా తెరిపి ఇవ్వకుండా పడుతున్న వర్షాలతో వారంతా రోడ్లపైకి రావడం లేదు. మధురవాడ రోజువారీ మార్కెట్ కూడా జన సంచారం లేక బోసిపోయింది.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

భీమునిపట్నం (రూరల్) : వర్షాలకు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. ముఖ్యంగా నగరపాలెం, దాకమర్రి సమీపంలో ఉన్న రోడ్లు పూర్తిగా బురదమయం కావడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టినా, మళ్లీ పాడయ్యాయి.

తుమురుగెడ్డకు జలకళ

మధురవాడ : పీఎంపాలెం హౌసింగ్ బోర్డు కాలనీ ఆఖరి బస్టాపు సమీపంలో ఉన్న తుమురు గెడ్డ జలాశయం మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటితో కళకళలాడుతోంది. ఈ రిజర్వాయర్‌లో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉంటుంది. దీని ద్వారా పీఎంపాలెం, బక్కన్నపాలెం, ఆర్‌హెచ్ కాలనీ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతోంది. రెండు కొండల మధ్య ఉన్న ఈ రిజర్వాయరు పక్క నుంచి శంభువానిపాలెం గిరిజన గ్రామానికి రహదారి ఉంది. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏఓ

పద్మనాభం/రూరల్ : మండలంలో మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ చలం సూచించారు. శుక్రవారం ఆయన పాండ్రంగి, సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాల్లో భద్రపరిచిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్ప పీడనం వాయుగుండంగా మారడంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, రైతులు ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యాన్ని అందుబాటులో



కోతకు గురైన రుషికొండ బీచ్

ఉన్న కొనుగోలు కేంద్రాలకు తరలించాలని తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు విజయప్రసాద్ అయినాడ, బీఆర్ తాళ్లవలసలో పర్యటించి, కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాలను పరిశీలించారు.

వరి పొలాల పరిశీలన

ఆనందపురం : వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన జగన్నాథపురం, కుసులవాడ, పొడుగుపాలెం, వెల్లంకి గ్రామాల్లోని వరి పొలాలను ఏఓ సంధ్య రత్నప్రభతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 35 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, 175 ఎకరాల్లో కోతలను వాయిదా వేసినట్టు చెప్పారు.

సింహగిరిపై భారీ వర్షం

సింహాచలం : సింహగిరిపై భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షంతో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో మాడవీధులు నిర్మానుష్యంగా మారాయి. అప్పన్న ఆలయంలో వర్షపునీరు చిమ్మడంతో ప్రాంగణం బురదమయింది.

కోతకు గురవుతున్న తీరం

భీమునిపట్నం : బీచ్ రోడ్డులో కెరటాల ఉధృతికి బోయవీధి వద్ద రహదారి కోతకు గురవుతోంది. ఇక్కడ నిర్మించిన ప్రహరీ అడుగు భాగం కెరటాల తాకిడికి మట్టి నానిపోయి కిందకు జారిపోతోంది. ఈ విషయాన్ని మత్స్యకారులు ఆ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండకు తెలియజేయడంతో వెంటనే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అక్కడికి చేరుకుని పరిస్థితిని జీవీఎంసీ అధికారులకు తెలిపారు. వారు బండరాళ్లు తీసుకువచ్చి కోతకు గురవుతున్న ప్రదేశంలో వేశారు. అలాగే నోవాటెల్ హోటల్ ముందు కూడా తీరం కోతకు గురవుతోంది. ఎగువపేట పోలమాంబ అమ్మవారి ఆలయం నుంచి బోయవీధి, లైట్ హౌస్ మీదుగా తోటవీధి వరకు



బోయవీధి వద్ద కోతకు గురవుతున్న తీరం



బురదమయమైన దాకమర్రి, గెద్దపేట రోడ్డు




ఎర్రయ్యపాలెం రోడ్డు దుస్థితి

రిటర్నింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు పలుమార్లు పాలకులు, అధికారులను కోరుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

రుషికొండ బీచ్‌లో...

సాగర్‌నగర్ : రుషికొండ బీచ్‌లో అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో తీరం కోతకు గురవుతోంది. బోటు షికార్ నిర్వహిస్తున్న ప్రాంతానికి సమీపంలో జెట్టీ కోసం ఏర్పాటు చేసిన రాళ్ల వద్ద ఇసుక మేటలు కోతకు గురవ్వడంతో అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడింది. మరోవైపు కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉండడంతో సుభాష్‌నగర్, భువనేశ్వరినగర్ ప్రాంతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని చినగదిలి రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ సూచించారు.

విశాలాక్షినగర్ : జోడుగుళ్లపాలెం తీరంలో సముద్రం కాస్తా ముందుకు వచ్చింది. జోడుగుళ్లపాలెం తీరంలోకి జాలర్లు వేటకు వెళ్లలేదు. పర్యాటక ప్రాంతాలైన తెన్నేటి పార్కు, కైలాసగిరి తదితర పర్యాటక ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి అంతంత మాత్రమే ఉంది.



నీటితో కళకళలాడుతున్న తుమురుగెడ్డ జలాశయం



జోడుగుళ్లపాలెం వద్ద అల్లకల్లోలంగా ఉన్న సముద్రం

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజ్‌కుమార్

తగరపువలస, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జ్ఞాన్ 2కె 24 పేరుతో శుక్రవారం వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ కళాశాలలకు చెందిన మూడు వేల మంది విద్యార్థులు హాజరై 102 ప్రాజెక్టులను ప్రదర్శించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ట్విన్ సిలెండర్ పంపు ప్రాజెక్టు, పెడల్ తొక్కుతుంటే పనిచేసే ఫ్లోర్ గ్రైండర్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే సోలార్‌తో నడిచే మూడు చక్రాల సైకిల్, ఇరుకు ప్రాంతాల్లో కూడా సమాచారం తీసుకునే డ్రోన్ నమూనా, ప్రయాణ సమయంలో డ్రైవరు నిద్రపోతే నిద్ర లేపే ఏసీ స్లీప్ అలారం వంటివి ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ ఆర్‌వీ రాజకుమార్, ఇన్ఫోసిస్ గ్రూప్ ప్రాజెక్టు మేనేజరు నర్రా నగేశ్, ఇండియన్ సర్వీసెస్ సీఈఓ సాయి సతీశ్, స్టీల్ ప్లాంటు జనరల్ మేనేజర్ నగేశ్, ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ గణేశ్ ప్రదర్శనలో ఉత్తమమైనవి ఎంపిక చేసి, నగదు బహుమతులు అందించారు.

విశాఖకు గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజశేఖరరెడ్డి

సాగర్‌నగర్,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో భౌగోళిక ప్రాధాన్యత గల ఎర్రమట్టి దిబ్బలు, తీరంలోని శిలలు, మన్యం జిల్లాలో బొర్రా గుహలు, బాక్సైట్ ఖనిజం, ప్రాచీన బౌద్ధ క్షేత్రాలకు యునెస్కో గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు తీసుకురావడం అవసరమని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ విశాఖ కన్వీనర్ డాక్టర్ డి. రాజశేఖరరెడ్డి తెలిపారు. గీతం వర్సిటీలోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ చరిత్ర విభాగంలో శుక్రవారం నిర్వహించిన సంస్కృతి పరిరక్షణ - సవాళ్లు, అవకాశాలు అన్న సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాల్లో 213 వరకు యునెస్కో గ్లోబల్ జియో పార్కులు ఉన్నాయని,భారత్‌లో ఐదు ప్రాంతాలను గుర్తించగా వాటిలో విశాఖ ఒకటి అని తెలిపారు. గుర్తింపు లభిస్తే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించవచ్చునన్నారు. విశాఖకు యునెస్కో గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు తీసుకురావడానికి ఇంటాక్ చేస్తున్న కృషికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 42 మంది ఎంపిక

ఆనందపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ సెయింట్-గోబియన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. వీటిలో 42 మంది ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి రూ. 2లక్షల వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ కార్తీక్ చెప్పారు.

పరీక్షా పే చర్చకు ఆహ్వానం

భీమునిపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలపై చర్చించడానికి నేరుగా ప్రధాన మంత్రితో మాట్లాడడానికి కేంద్రం పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎనిమిదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఆందోళన పోగొట్టడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రిజిస్టర్ చేసిన ప్రశ్నల్లో ఎంపిక చేసిన విద్యార్థులతో ప్రధాని స్వయంగా పరీక్షలపై చర్చిస్తారని చెప్పారు. ఈ ప్రశ్నలకు మై గౌట్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత మొబైల్‌తో ఈ మెయిల్ వినియోగించి లాగిన్ అయి ఓటీపీ ద్వారా పాల్గొనవచ్చన్నారు.

తీరానికి పరిమితమైన పడవలు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం కావడంతో మత్స్యకారులు చేపల వేటకు విరామం ప్రకటించారు. పడవలను తీరంలో నిలుపుదల చేసి, ఇళ్లకు పరిమితమయ్యారు. మండలంలోని అన్నవరం, నాగమయ్యపాలెం, పాతపాలెం ప్రాంతాలకు చెందిన మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. అల్పపీడనం హెచ్చరికల నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొనడంతో తీరంలోనే ఉండిపోయారు.



అన్నవరం తీరంలో నిలిపిన పడవలు

భూముల విలువ సవరణ

... 5వ పేజీ తరువాయి

రూ.13,500 చేశారు.

- కాకానినగర్‌లో గజం రూ.40 వేలు ఉండగా, మార్కెట్ రేటు రూ.75 వేలు పలుకుతోంది. దీనిని 12.5 శాతం పెంచి 45 వేలు చేయాలని ప్రతిపాదించారు.
- పీఎం పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఎంవీవీ సిటీలో గజం స్థలం రూ.40 వేలు కాగా మార్కెట్ రేటు రూ.70 వేలు ఉంది. దీనిని 10 శాతం పెంచి రూ.44 వేలు చేశారు. అక్కడ ఫ్లాట్ కొంటే చ.అడుగు ధర రూ.4 వేలు ఉండగా మార్కెట్ విలువ రూ.7 వేలు పలుకుతోంది. దాంతో 5 శాతం పెంచి రూ.4,200 చేశారు.
- మధురవాడ వుడా రెవెన్యూ లేఅవుట్‌లో గజం ధర రూ.45 వేలు కాగా మార్కెట్ విలువ రూ.90 వేలు పలుకుతోంది. దాంతో 22 శాతం పెంచి రూ.55 వేలు చేశారు.
- చంద్రపాలెంలో గజం ధర రూ.30 వేలు కాగా మార్కెట్ రేటు రూ.55 వేలు పలుకుతోంది. 10 శాతం పెంచి రూ.33 వేలు చేశారు.
- సాయిప్రియా లేఅవుట్‌లో గజం రూ.35 వేలు కాగా మార్కెట్ రేటు రూ.60 వేలు ఉంది. దానిని 22 శాతం పెంచి రూ.44 వేలు చేశారు.
- బక్కన్నపాలెంలో గజం రూ.20 వేలు కాగా మార్కెట్ రేటు రూ.40 వేలు ఉంది. దీనిని 20 శాతం పెంచి రూ.24 వేలు చేశారు.
- కొమ్మాదిలో గజం రూ.18 వేలు కాగా మార్కెట్ రేటు రూ.35 వేలు ఉంది. దాంతో 17శాతం పెంచి రూ.21 వేలు చేశారు.
- ఒమ్మివానిపాలెం (వాడపాలెం)లో గజం ధర రూ.18 వేలు కాగా మార్కెట్ ధర రూ.50 వేలు ఉంది. దాంతో 67 శాతం పెంచి రూ.30 వేలు చేశారు.
- పెదరుషికొండలో గజం రూ.22 వేలు కాగా మార్కెట్ రేటు రూ.50 వేలు ఉంది. దీనిని 36 శాతం పెంచి రూ.30వేలు చేశారు.
- గుడ్లవానిపాలెంలో గజం ధర రూ.24 వేలు కాగా మార్కెట్ రేటు రూ. 50 వేలు ఉంది. 38 శాతం పెంచి రూ.33 వేలు చేశారు.
- ముడసర్లోవ ప్రాంతం ఇటీవల బాగా అభివృద్ధి చెందడంతో అక్కడ భూములు రేట్లు పెరిగాయి. కానీ కృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ఏరియాల్లో గజం ప్రభుత్వ ధర రూ.14 వేలే ఉంది. మార్కెట్ రేటు 35 వేలు వరకు ఉంది. ఇక్కడ 43 శాతం పెంచి 20 వేలు చేశారు.
- ఆనందపురం మండలం పాలవలసలో వుడా అప్రూవల్ లేఅవుట్‌లో గజం రూ.3,700 ఉండగా మార్కెట్ రేటు రూ.8 వేలు ఉంది. దానిని 62 శాతం పెంచి రూ. 6 వేలు చేశారు.
- బోని గ్రామంలో గజం ధర రూ.950 మాత్రమే ఉంది. మార్కెట్ రేటు రూ. 2 వేలు కాగా 58 శాతం పెంచి రూ.1,500 చేశారు.
- పద్మనాభం మండలం అమనాంలో ఎకరా భూమి ధర రూ.45 లక్షలు కాగా మార్కెట్ రేటు రూ.90 లక్షలు ఉంది. దీనిని 33 శాతం పెంచి రూ.60 లక్షలు చేశారు.
- చేపలుప్పాడలో ఎకరా ధర రూ.1.3 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.2.7 కోట్లు ఉంది. దీనిని 23 శాతం పెంచి రూ.1.6 కోట్లుకు ప్రతిపాదించారు.
- దాకమర్రిలో ఎకరా రూ.1.2 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.2.3 కోట్లు ఉంది. దానిని 23 శాతం పెంచి రూ.1.6 కోట్లు చేశారు.
- కాపులుప్పాడలో ఎకరా రూ.2.1 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.4.3 కోట్లు ఉంది. దానిని 19 శాతం పెంచి రూ.2.5 కోట్లకు పెంచారు.

జీవీఎంసీ బడ్జెట్ రూ.4,554.27 కోట్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టుల ద్వారా రూ.560 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.312.26 కోట్లు, యూసీడీ ద్వారా రూ.15 కోట్లు, పార్కుల ద్వారా రూ.20 కోట్లు, ప్రజారోగ్యం ద్వారా రూ.22.59 కోట్లు, నీటి సరఫరా ద్వారా రూ.438.80 కోట్లు, అమృత్ ద్వారా రూ.300 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా రూ.450 కోట్లు, ఇతర ప్రాజెక్టుల కింద రూ.148 కోట్లు..మొత్తం ప్రారంభ నిల్వతో కలిపి రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు.

వైసీపీకి వరుస షాక్‌లు


... 5వ పేజీ తరువాయి

కూడా కూడగట్టలేకపోయారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 23న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమానికి వైసీపీ నిర్ణయించింది. ఈలోగా 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్య నాయకులు బయటకు వెళ్లిపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన ఆ పార్టీ నేతల్లో ఉంది. ఆయనతోపాటు డెయిరీలో డైరెక్టర్లుగా ఉన్న 12 మంది కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇక మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కోలా గురువులు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు వంటివారు పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు. మరికొందరు నేతలు కూడా పార్టీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

రోజులపాటు వారి సేవల పొడిగింపు అంశంపై కమిటీ సభ్యులు చర్చించారు. కార్మికులను ఎవరు నియమించారు?, వారికి వేతనాలను ఎవరి ద్వారా చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాన వైద్యాధికారి గానీ ఆయా జోన్ల సహాయ వైద్యాధికారులు గానీ అందుబాటులో లేకపోవడంతో జోన్-6కి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒకరు సమాధానం ఇచ్చారు. కార్మికులను ఎవరు నియమించారనేది తనకు తెలియదని, వేతనాలను మాత్రం స్వయం సహాయక సంఘాల ద్వారా జీవీఎంసీ చెల్లిస్తున్నట్టు చెప్పారు. తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపులో భాగంగా నోడల్ స్వయం సహాయక సంఘాలకు రెండు శాతం కమీషన్ ఎందుకు ఇస్తున్నారని అధికారులను స్టాండింగ్ కమిటీ సభ్యులు నిలదీశారు. ఆదాయ పన్ను కింద రెండు శాతం ఇస్తున్నందున అదనంగా సర్వీస్ చార్జీ పేరుతో మరో రెండు శాతం ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఐటీ కింద ఇచ్చే రెండు శాతం ఆయా సంఘాల ఖాతాల్లోనే ఉంటుంది కాబట్టి, సర్వీస్ చార్జీ పేరుతో ప్రత్యేకంగా కేటాయింపులు జరపడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇకపై సర్వీస్ చార్జీ లేకుండా ఆదేశాలు ఇవ్వాలని మేయర్‌ను సభ్యులు కోరారు. అలాగే ఇప్పటికే పారిశుధ్య నిర్వహణకు 6,500 మందికి పైగా కార్మికులు ఉన్నందున, ఇకపై అవసరమైతే తప్ప రొటీన్‌గా వారి సేవలను పొడిగించాలంటే కుదరదని సభ్యులు స్పష్టం చేశారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి ఐఎన్ఎస్ డేగా రోడ్డుతోపాటు పోర్టు ఫ్లైఓవర్ బ్రిడ్జిలను శుభ్రం చేసే కార్మికులకు జీవీఎంసీ వేతనాలు చెల్లించడంపై సభ్యులు అధికారులను నిలదీశారు. పోర్టు అవసరాలు తీరుస్తున్న రోడ్ల నిర్వహణను జీవీఎంసీ చూడాలంటే సీఎస్ఆర్ కింద నిధులు రాబట్టాలని అధికారులకు సూచించారు. అలాగే గాజువాక నుంచి చెట్ల వ్యర్థాలు కాపులుప్పాడ యార్డుకు తరలింపు, గాజువాక జోన్‌లో వివిధ వార్డుల నుంచి చెత్త సేకరించే ఆరు వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి జీతాలు చెల్లించే అంశాలపై వివరణ ఇవ్వాలంటూ అధికారులను సభ్యులు కోరారు. దీనికి సంబంధిత అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టాండింగ్ కమిటీ వంటి ముఖ్య సమావేశం జరిగితే అధికారులకు గైర్హాజరు కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై విభాగాల అధిపతులు సమావేశానికి హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని మేయర్‌ను కోరారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన రెండు అంశాలు, గాజువాక జోన్‌లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే వాహనాల డ్రైవర్లకు వేతనాలు చెల్లించే అంశంతోపాటు జోన్-7లో ఆక్రమణలు, అనధికార ఫ్లెక్సీలు తొలగించడానికి ఐదుగురు అన్‌స్కిల్డ్ లేబర్‌ను ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించే అంశాలను వాయిదా వేయాలని తీర్మానించారు. మిగిలిన అంశాలను ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, మెకానికల్ ఈఈ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో తహసీల్దార్‌కు సమస్యలను వివరిస్తున్న రైతులు

చిన్నాపురంలో రెవెన్యూ సదస్సు

పద్మనాభం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె. ఆనందరావు చెప్పారు. చిన్నాపురంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజల ముంగిటకే వచ్చి వినతులు స్వీకరించి, రెవెన్యూపరమైన సమస్యలకు పరిష్కారాలను చూపుతున్నామన్నారు. అనంతరం రైతులు పలు సమస్యలపై తహసీల్దార్‌కు వినతులు అందించారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు : కలెక్టర్

మహారాణిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచటంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు వి.ఆదిశేషు, ఆర్‌డీవో వి.శ్రీలేఖ పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్సుకు విశాఖ అనుకూలం

» మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌కు వివరించిన శాప్ చైర్మన్



వరుణ్‌సింగ్‌ను కలిసిన శాప్ చైర్మన్ రవినాయుడు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ స్పోర్ట్సు సర్వీసెస్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి వరుణ్ సింగ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వాటర్ స్పోర్ట్సు అభివృద్ధిపై మాట్లాడారు. వాటర్ స్పోర్ట్సు విశాఖ అనుకూల ప్రాంతమని, ఇక్కడ వాటర్ గేమ్స్‌కు సంబంధించి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కయాకింగ్, కెనాయింగ్ శిక్షణ కేంద్రాల నిర్వహణకు సంబంధించి అనుకూలమైన నీటివనరులను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై చర్చించి తగిన సహాయ సహకారాలందిస్తామని వరుణ్‌సింగ్ హామీ ఇచ్చారని రవినాయుడు తెలిపారు. అనంతరం ఈఈపీసీ ఇండియా డిప్యూటీ డైరక్టర్ దీపక్ ఠాకూర్‌ను కలిసి రాష్ట్రానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు కేటాయించాలని కోరారు.

స్థలం కేటాయించాలి

సిరిపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రామప్రసాద్‌రెడ్డిని ఇటీవల ఎన్నికైన శ్రీవేమన సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గొరుసు మహేశ్వరరెడ్డి, సత్తి నాగేశ్వరరెడ్డి కలిశారు. తమ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు.

సినిమా గైడ్

● **బచ్చలమల్లి :** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2 :** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ :** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా :** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2 :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 20, వంకాయలు(తెలుపు) 34, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 28, క్యారెట్ 40 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామ కాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

వాన దెబ్బకు జనజీవనం విలవిల

» పనులు దొరక్క కూలీలు ఇంటికే పరిమితం
» మత్స్యకారులు చేపల వేటకు వెళ్లలేని పరిస్థితి
» రహదారులు జలమయం
» వాహనదారులకు తప్పని ఇబ్బందులు



బురదమయంగా తయారైన తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. కూలి పనులు లేక కొందరు, వ్యాపారాలు మూత పడి చిరు వ్యాపారులు, కొనే వారు కనిపించక దుకాణదారులు ఇబ్బంది పడ్డారు. చేపల వేటకు వెళ్లని బోట్లు జాలారిపేట ఒడ్డునే ఉండిపోయాయి. తీరంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఒడ్డు అంతా చెత్తా చెదారంతో కనిపిస్తోంది. వివిధ ఆహార పదార్థాలు, టిఫిన్ బండ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో కళకళలాడే ఎంవీపీ ఏఎస్ రాజా మైదానం కూడలి బోసిపోయింది. ఈ వర్షంలో ఆహార పదార్థాలు తయార చేయడం ఇబ్బందిగా తయారైంది. కొందరు ఏవో బాధలు పడి తయారు చేసినా తీరా సాయంత్రాని వర్షం ఎక్కువ కావడంతో కొనేవారు కరువయ్యారు. చాలామంది చిరు వర్తకులు, కూలీలు ఇంటికే పరిమితం అయ్యారు. రోడ్లపై వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



జాలారిపేటలో తీరంలో నిలిపి ఉన్న బోట్లు

ఆరిలోవలో..

ఆరిలోవ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల దెబ్బకు ఆరిలోవ, పరిసర ప్రాంతాల్లో చాలా చోట్ల వరద చేరింది. పెదగదిలి జంక్షనులో వర్షం నీరు అధికంగా చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం బురదమయంగా తయారైంది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. అలాగే పలు చోట్ల వర్షం నీరు చేరడంతో వీధులు బురదగా తయారయ్యాయి. రోడ్లపై ఎక్కడికక్కడే నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో వారు ఇంటికే పరిమితమయ్యారు. చిరు వ్యాపారులు సైతం బేరాలు లేక ఇబ్బంది పడ్డారు. తోపుడు బండ్ల వ్యాపారాలు చేసుకునే అవకాశమే లేకుండా పోయింది.

అధిక పన్నుల భారం తగ్గించాలి

» కరపత్రం విడుదల చేసిన వార్వా



కరపత్రం ఆవిష్కరిస్తున్న వార్వా ప్రతినిధులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఆస్తి పన్ను, ట్రూ ఆప్ చార్జీలు, టోల్ చార్జీలు, ప్రవేశ రుసుములు వంటి అనేక పేర్లతో నగర ప్రజలపై విపరీతమైన భారాలు వేయడాన్ని వ్యతిరేకిస్తూ, అలాగే ప్రజల ఆస్తులైన స్టేడియం లను, పార్కులను ప్రైవేటు వారి సొంతం చేసిన నిర్ణయాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ విశాఖపట్నం అపార్టుమెంటు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా) శుక్రవారం 'వార్వా నివాస్' అనే కరపత్రాన్ని విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని జీవన్‌సౌదా అపార్టుమెంట్‌లో జరిగిన కార్యక్రమంలో వార్వా ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన లగాయతు ప్రజలపై భారాలు తగ్గుతాయని ఆశించామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసిందని, దీన్ని ఆహ్వానిస్తున్నామని, కానీ ఇంకా చేయాల్సినవి ఉన్నాయన్నారు. ఆస్తి విలువ ఆధారిత ఆస్తిపన్ను 2021లో గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని, ప్రజలు దీన్ని తీవ్రంగా నిరసించారని, జీవీఎంసీ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ పదివేల మందికి పైగా కోవిడ్‌ను సైతం లెక్క చేయకుండా పిటీషన్లు సమర్పించామన్నారు. మరింత మంది ఆన్లైన్లో పిటిషన్లు సమర్పించామని, కానీ ప్రజానీకం అభిప్రాయాన్ని లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను అమలు చేసిందన్నారు. దీనివల్ల ఐదేళ్లకు ఒకసారి పెరగాల్సిన ఇంటి పన్ను ప్రతీ ఏడాది పెంచుతున్నారని, ఆస్తులు విలువలు, నిర్మాణ విలువలు 10 నుంచి 20 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం వల్ల కూడా ఆస్తి పన్ను పెరుగుతోందన్నారు. ట్రూ ఆప్ చార్జీలు, ఫ్యూయల్ సర్దుబాటు చార్జీల వల్ల విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరుగుతున్నాయని, మనం వాడే కరెంటుకు రెండు లేక మూడు రెట్లు చార్జీలు కట్టవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా అన్యాయమన్నారు. బీచ్‌లో ప్రవేశ రుసువ పెట్టరాదని, సింగిల్ ఎంట్రీ, ఇతర పద్ధతుల్లో పెంచుతున్న టోల్ చార్జీలు వెనక్కి తీసుకోవాలని కోరారు. నగరంలోని ప్రజల ఆస్తులైన పార్కులు, స్పోర్ట్స్ స్టేడియంలను ప్రభుత్వమే నడపాలని, విశాఖ పోర్టు స్టేడియంను విశ్వనాథ్ నుంచి వెనక్కి తీసుకోవాలన్నారు. విశాఖ ఉక్కు రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలతో 10 వేల కరపత్రాలను 'వార్వా నివాస్' నగరంలో అపార్టుమెంట్లు, కాలనీ వాసుల్లోనూ పంచనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వార్వా ప్రధాన కార్యదర్శి బీబీ గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ, మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు సాంకేతిక లోపం

గంటల తరబడి స్టేషన్‌లో నిలిచిపోయిన రైలు

రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పడిగాపులు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే (12861) ఎక్స్‌ప్రెస్ రైలుకు సాంకేతిక లోపం ఏర్పడి గంటల తరబడి స్టేషన్‌లో నిలిచిపోయింది. విశాఖ నుంచి శుక్రవారం సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు రాత్రి 9.00 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫామ్ నుంచి కదిలింది. ఈ రైలు కోచింగ్ కాంప్లెక్సు నుంచి నిర్ణీత సమయం ప్రకారం ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్‌కు చేరింది. అయితే ప్రయాణికులు కోచ్‌ల్లో ప్రవేశించి తమ బెర్తు/సీటులో కూర్చొన్నారు. నిర్ణీత సమయం ప్రకారం 6.40 గంటలకు బయలుదేరాల్సి ఉండగా...ఎటువంటి సమాచారం లేకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు స్టేషన్‌లో పడిగాపులు పడాల్సి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ రైలుకు చెందిన ఏసీ కోచ్‌లో (బి7) సాంకేతిక లోపం తలెత్తడంతో ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్‌కు చెందిన లైనులో పవర్ బ్లాక్ చేసి రైలును నిలిపివేసినట్లు తెలిసింది. సాంకేతిక లోపాన్ని సరిదిద్దడానికి సుమారు రెండున్నర గంటల సమయం పట్టడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పై గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మరమ్మతులు పూర్తయిన తర్వాత రాత్రి 9.00 గంటల సమయంలో రైలు ప్లాట్‌ఫామ్ నుంచి కదిలింది. రైలు ఆలస్యానికి సంబంధించిన సమాచారాన్ని స్టేషన్‌లో సమాచార కేంద్రం ద్వారా ఎప్పటికప్పుడు తెలియపరచకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురికావడమే కాకుండా రైల్వే సిబ్బంది తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ రైలు కదలకపోవడంతో నామినేషన్ ప్రకారం శుక్రవారం రాత్రి 8.30 గంటలకు ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరాల్సిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) ఐదో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి నడపాల్సి వచ్చింది.

డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా ఏయూ

» వీసీ శశిభూషణరావు



సమావేశంలో పాల్గొన్న వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయ రావు, పలువురు ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా యూనివర్సిటీని మత్తుపదార్థాల రహితంగా తీర్చిదిద్దుతున్నామని ఉపకులపతి జి.శశిభూషణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌తో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మత్తు పదార్థాల పర్యవసానాలు, నష్టాలను విద్యార్థులకు వివరించడం, వారిని వీటికి దూరంగా ఉంచడం నిరంతర ప్రక్రియగా కార్యక్రమాలను జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపును స్వీకరిస్తూ డ్రగ్స్ రహితంగా ఏయూ తయారు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సంబంధ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆషిమా సలీం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలో నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. వారికి తమ సంస్థ తరఫున ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. నోడల్ అధికారులు విద్యార్థులలో అవగాహన కలిగించడం, పోస్టర్ తయారీ, వ్యాసరచన పోటీలో నిర్వహించడం, అవగాహన ర్యాలీలు, సిగ్నేచర్ క్యాంపెయిన్ వంటివి చేపట్టాలని సూచించారు. అలాగే డ్రగ్ కంట్రోల్ ఛాంపియన్స్‌గా యువతను గుర్తించి వారి ద్వారా సమాజంలో విస్తృతమైన చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, ఎ.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నృత్యోత్సవం



దేవిస్తుతి నృత్యప్రదర్శనలో కళాకారుల హావభావాలు

మద్దిలపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ శుక్రవారం నిర్వహించిన నృత్యోత్సవం నేత్రపర్వంగా సాగింది. వెంకట చిన్నారావు శిష్య బృందం గణేశ శృతి, దేవీస్తుతి, దశావతార భరతనాట్య రూపకాలు అద్భుతంగా ప్రదర్శించారు. జయ జయ దుర్గే, మహిషాసుర మర్దిని గానాలకు చేసిన నాట్యాలు మంత్రముగ్దులను చేశాయి. అన్నమయ్య కృతిలో అలరులు కురియగా, దశావతార కీర్తనలో దేవకి నందన పాటలకు ప్రదర్శించిన నాట్యాలు ఆద్యంతం రక్తి కట్టించాయి. విష్ణువు దశావతరాలు మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురాముడు, రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, కల్కి అవతరాలు వర్ణించే నృత్య ప్రదర్శనలకు చప్పట్లు మారుమోగాయి. కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్, డాక్టర్ ఇందిర, రమణమూర్తి, కళాభారతి నిర్వహకులు గుమ్మలూరి రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవం



రామానుజన్‌కు అంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) ప్రాంగణంలో శుక్రవారం జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. డిసెంబరు 22న, గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని జాతీయ గణిత శాస్త్ర దినోత్సవంగా నిర్వహించాల్సి ఉండగా, అయితే డిసెంబరు 22 ఆదివారం కావడంతో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నగరాజకుమారి ప్రసంగిస్తూ నిత్యజీవితంలో గణిత ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

అక్కయ్యపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలో ఓ వ్యక్తి (50) రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 6-30 గంటల సమయంలో ఓ వ్యక్తి రైల్వే న్యూకాలనీ సాయిబాబా ఆలయం దగ్గర ఫుట్‌బాల్ మైదానం వద్ద రోడ్డు దాటుతుండగా, అదే సమయంలో తాటిచెట్లపాలెం వైపు నుంచి రైల్వే న్యూకాలనీ వైపు వస్తున్న ఒక మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. అతని తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయనను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. కొద్ది రోజుల తర్వాత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఎస్సై 9440796034, ఏఎస్సై 9848221183 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. పోలీసులు బీఎన్ఎస్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఫార్మాకోకినెటిక్స్ - ఇండస్ట్రీ అనువర్తనాలు'పై ప్రత్యేక ప్రసంగాలు



ప్రసాద్‌ను సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు, పలువురు ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ఏయూ కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పూర్వ విద్యార్థి, యూఎస్ఏ డైచి, క్లినికల్ ఫార్మకోలజీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ ఎన్.వి.టాటా తాను చదువుకున్న కళాశాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి.సుబ్బారావు ఆడిటోరియంలో 3 రోజుల పాటు నిర్వహిస్తున్న బయో అనలిటికల్ టెక్నిక్స్, ఫార్మా కోకినెటిక్స్-ఇండస్ట్రీ అనువర్తనాలుపై నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో శుక్రవారం పాల్గొని ప్రసంగం చేశారు. ప్రాథమిక సూత్రాలు, పరిశ్రమ అనువర్తనాలపై తన విలువైన అనుభవాలను పంచుకున్నారు. ఎం.ఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులు ఈ లెక్చర్స్ ఎంతో ఉపయోగంగా నిలిచాయి.

అనంతరం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయ్‌రావు, ఫారెన్సీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.గిరిజాశంకర్, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్ కుమార్‌లతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్‌ను సత్కరించారు. ప్రసాద్ ప్రసంగానికి కళాశాలలోని ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు కృతజ్ఞతలను వ్యక్తం చేశారు.



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, అపోలో సీఓఓ రామచంద్ర తదితరులు

పోలీసు-అపోలో అంబులెన్స్ సేవలు ప్రారంభం

ఆరిలోవ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమదాలకు గురైన చాలా మంది సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, వీరిని ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలిస్తే చాలా వరకు బతికే అవకాశం ఉంటుందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. నగర పోలీసు శాఖ, అపోలో ఆస్పత్రి సంయుక్తంగా అంబులెన్స్ సేవలు సేవలను శుక్రవారం సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే తొలి గంట (గోల్డెన్ అవర్)లో ఆస్పత్రికి తరలించడం అవసరం అన్నారు. ఈ క్రమంలో అపోలో ఆస్పత్రి యాజమాన్యానికి అంబులెన్స్‌లను ఇవ్వమని కోరామన్నారు. ఇది 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. అపోలో ఆసుపత్రి సీఓఓ రామచంద్ర మాట్లాడుతూ ఈ అంబులెన్స్ సేవలు భీమునిపట్నం, ఆనందపురం, పీఎం పాలెం, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, త్రీటౌన్, మహారాణిపేట, వన్‌టౌన్, ద్వారకా బస్టాండ్, ఫోర్త్‌టౌన్, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, దువ్వాడ, స్టీల్‌ప్లాంట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉంటాయన్నారు. అంబులెన్స్ సేవలు కోసం టోల్ ఫ్రీ నెంబరు 1066లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాలకృష్ణ, ఏడీసీపీ ప్రవీణ్ తదితరలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంలను సందర్శించిన కలెక్టర్



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఆరిలోవ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండలం సమీపంలో గల ఈవీఎం గోదాంలను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. నెల వారి తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్‌తో కలసి తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్ళను పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ ఉన్న అధికారులకు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేశారు.

మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైద్య సేవలకు సంబంధించి మెడికవర్ ఆస్పత్రి రూపొందించిన మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డును శుక్రవారం ఆవిష్కరించారు. వెంకోజీపాలెంలోని ఆస్పత్రి ప్రాంగణంలో ఏపీ వ్యవసాయ, పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కని, ఈ కుటుంబ కార్డు వంటివి నాణ్యమైన ఆరోగ్యాన్ని సామాన్యులకు మరింత చేరువ చేసేందుకు దోహదపడతాయన్నారు. సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో 25 మెడికవర్ హాస్పిటల్‌లో ఓపీ కన్సల్టేషన్‌లపై 30 శాతం తగ్గింపు, ఓపీడీ పరిశోధనలపై 15 శాతం, ఐపీ అండ్ డే కేర్ సేవలపై 10 శాతం తగ్గింపు (ఫార్మసీ, వినియోగ వస్తువులు మినహా), 50 శాతం తగ్గింపు వంటి అధికారాలను ఈ కార్డు ద్వారా పొందవచ్చన్నారు. బీమా, కార్పొరేట్ అడ్మిషన్ల కోసం వైద్యేతర సేవలపై ఉచిత అంబులెన్స్ పికప్, డ్రాప్ 10 కిలోమీటర్ల లోపు హోమ్‌కేర్ సేవలపై 30 శాతం తగ్గింపు (ఫార్మసీ మినహా) రూ.5 వేలు కంటే ఎక్కువ బిల్లులకు ఫార్మసీపై 20 శాతం తగ్గింపు, హెల్త్ చెక్ అప్‌లపై 10 శాతం తగ్గింపు కార్డు ద్వారా లభిస్తుందన్నారు.

హవామహల్‌లో ఛాయాచిత్ర ప్రదర్శన



ప్రదర్శన ప్రారంభించిన అనంతరం ఫొటోలను వీక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

రామ్‌నగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విశాఖ నగర పర్యాటకంగా అభివృద్ధిని ఒకే చోట నుంచి వీక్షించే అవకాశం కలుగుతుందని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖ కెమెరా క్లబ్ 25వ వజ్రోత్సవం సందర్భంగా శుక్రవారం బీచ్‌రోడ్డులోని హవామహల్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీపీ ప్రారంభించారు. ఫోటోలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ అందాలను చూసేందుకు ఇదో చక్కని అవకాశం అన్నారు. చూడ చక్కని 700కు పైగా ఫొటోలను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఇక్కడ అందాలే కాకుండా ఫొటోగ్రాఫర్ల ప్రతిభ విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ఈ ఛాయాచిత్ర ప్రదర్శన ఈ నెల 22 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జీవీఎంసీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో శుక్రవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జీవీఎంసీ సూపరింటెండెంట్ హెన్న నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులు కలిసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ తదితరులు హాజరై క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మంచి చేయడం, ప్రేమ, దయ, క్షమాగుణం అనేవి బైబిల్ ద్వారా ఏసుక్రీస్తు చెప్పారన్నారు. ఈ క్రిస్మస్ పండుగ అందరిలోను వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పేదలకు సాయం చేస్తూ మన సమాజానికి కూడా అందరూ స్ఫూర్తిమంతంగా నిలబడాలని, నగర అభివృద్ధికి కలిసిమెలసి స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆమె కోరారు. ఈ వేడుకలకు జీవీఎంసీలోని ఉద్యోగులు హాజరై కేక్ కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు. తొలుత యేసును పూజిస్తూ ప్రార్థనలు చేశారు. పలువురు ఉద్యోగులు ఏసుక్రీస్తు వారి స్తోత్రాలు, సూక్తులను చదివి వినిపించారు.

జి.స్టీఫెన్ పీటర్ ఫాదర్‌గా వ్యవహరించి ఏసుక్రీస్తు బోధనలు, సువార్తలను అందరికీ బోధించి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రుసుముల భారంపై భక్తుల్లో అసహనం

▸ కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు ▸ శీఘ్ర దర్శనాల పేరిట రుసుముల మోత ▸ వారికీ తప్పని నిరీక్షణ ▸ క్యూలైన్లలో సాధారణ భక్తులకు అగచాట్లు

జగదాంబ కూడలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాలవారు తమ ఇలవేల్పు గా భావించే కనకమహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌ను మార్గశిర మాసంలో దర్శించుకోవాలని ఆరాటపడుతుంటారు. ఏటా భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో దేవస్థానం అధికారులు ఈ ఏడాది దర్శన టిక్కెట్ రుసుములు పెంచారు. కాని వారికి కల్పించే సదుపాయాల్లో మార్పు కనిపించక పోవడం, దర్శనం ఆలస్యం అవుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనూ, గురువారం నాడు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో దర్శనాలకు వస్తున్నారు. ఉచిత దర్శనాలకు నిత్యం భక్తుల తాకిడి పెరిగింది. దీంతో శీఘ్రదర్శనాల కోసం భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. దేవస్థానం అధికారులు ప్రత్యేక దర్శనం రూ.100, శీఘ్రదర్శనం రూ.200. మార్గశిర మాసం విశిష్టదర్శనం రూ.500 వంతున రుసుములు నిర్ణయించి భక్తులపై భారం మోపడం విమర్శలకు తావిస్తోంది. సాధారణ రోజుల్లో రూ.50, రూ.100 మాత్రమే రుసుములు ఉండేవి. మార్గశిర విశిష్ట దర్శనం పేరుతో ఒక్కసారిగా రూ.500 రేటు పెట్టడాన్ని భక్తులు భారంగా భావిస్తున్నారు. రూ.100, రూ.200 వంతున రుసుము చెల్లించి క్యూలైన్లలో ఉన్నవారు కూడా భారంగా భావిస్తున్నారు. కుటుంబంలో సాధారణంగా నలుగురైదుగురు వంతున వస్తే రుసుములకే ఎక్కువ మొత్తం ఇవ్వాల్సి వస్తోందని, దీనికితోడు ప్రసాదాలు, ఇతర ఖర్చులు కలిపి భరించడం ఇబ్బందికరంగా ఉందని అంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి సంగతి ఇక చెప్పనవసరం లేదు. అమ్మవారి మూలవిరాట్ దర్శనానికి ఎక్కువగా ముత్తయిదువలు బృందాలుగా వస్తుంటారు. మూలవిరాట్ దర్శనం కోసం ఆశగా వస్తే ఈ రుసుములు భారంగా ఉంటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శనం చేసుకుని ఇంటికి వేగంగా వెళ్లాలనుకునే మహిళలు ఉచిత దర్శనాల క్యూలైన్లు చూసి నీరసించిపోతున్నారు. దీంతో ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు, ఆలయం వద్ద అడ్డదారిలో వెళ్లేందుకు కొందరు మార్గాలు వెతుకుతున్నారు. గురువారం ఏ సమయంలో చూసినా రద్దీ తగ్గడం లేదని అంటున్నారు. రుసుముల విషయంలో కాస్త వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. ఆలయంలో అన్ని రకాల పూజలకు భారీగానే రుసుములు పెంచడంతో సామాన్య భక్తులు విశేష పూజలకు దూరం కావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దర్శనం భారం కాకుండా దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నారు.



కనకమహాలక్ష్మి ఆలయంలో క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు



పసుపు, కుంకుమలు, పూలహారంతో మూలవిరాట్

ఈఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటుకు డిమాండ్



సమావేశంలో పాల్గొన్న సిటు నాయకులు సీహెచ్ నరసింగరావు, కుమార్, జ్యోతీశ్వరరావు

జగదాంబ కూడలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఈఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సిటు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 14 లక్షల మంది ఈఎస్ఐ సభ్యులు ఉంటే విశాఖలో కాకుండా అమరావతిలో ఈఎస్ఐ వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 500 పడకలతో విశాఖ షీలానగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అక్కడ వైద్య కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఏపీ అంటే అమరావతి అన్న భావనలో కూటమి ఉందని దుయ్యబట్టారు. ఎట్టి పరిస్థితుల్లో ఈఎస్ఐ వైద్య కళాశాలను విశాఖలోనే ఏర్పాటు చేయాలన్నది సీఐటీయూ డిమాండ్ అన్నారు. ఎన్నికల ముందు విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తామని, అలా కాకుంటే సొంత గనులు ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్న కూటమి నేతలు ఇప్పుడు నోరు మెదపడం లేదని విమర్శించారు. ఉక్కును పరిరక్షించే బాధ్యత టీడీపీపై లేదా? అని సూటిగా ప్రశ్నించారు. నక్కపల్లిలో ఆర్సిమిటల్‌తో ఉక్కుకర్మాగారం ఏర్పాటు ప్రకటన హాస్యాస్పదమన్నారు. పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కాకుండా అడ్డుకునే బాధ్యత కూటమిదేనన్నారు. ఆర్టీసీ 12,700 విద్యుత్ బస్సులను కొనుగోలు చేసి, వీటిని నడిపే బాధ్యత ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి ఆలోచిస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, విలువైన ఆ సంస్థ స్థలాలను అమ్మడానికి కుట్ర జరుగుతోందని, ప్రభుత్వ కుతంత్రాలను సిటు అడ్డుకొని తీరుతుందని హెచ్చరించారు. సమావేశంలో సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్టేట్ అధికారులు బాధ్యతల స్వీకరణ



కొండబాబు



కృష్ణమూర్తి

అక్కయ్యపాలెం/సీతమ్మధార, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్, సీతమ్మధార రైతుబజారులకు కొత్తగా బదిలీ అయిన ఎస్టేట్ అధికారులు కొండబాబు, కృష్ణమూర్తిలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు నరసింహనగర్‌లో విధులు నిర్వహించిన పి.చిన్నబాబు స్టీల్‌ప్లాంట్‌లోని రైతుబజారుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీతమ్మధార రైతుబజారు ఈవో కొండబాబు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వీరికి రైతులు, డ్వాక్రా సంఘాల వ్యాపారులు శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు, కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తామని వారు తెలిపారు.

వాటర్ స్పోర్ట్సుకు విశాఖ అనుకూలం

మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్‌కు వివరించిన శాప్ చైర్మన్

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్, స్పోర్ట్సు సర్వీసెస్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి వరుణ్‌సింగ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వాటర్ స్పోర్ట్సు అభివృద్ధిపై మాట్లాడారు. వాటర్ స్పోర్ట్సు విశాఖ అనుకూల ప్రాంతమని, ఇక్కడ వాటర్ గేమ్స్‌కు సంబంధించి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కయాకింగ్, కెనాయింగ్ శిక్షణ కేంద్రాల నిర్వహణకు సంబంధించి అనుకూలమైన నీటివనరులను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై చర్చించి తగిన సహాయ సహకారాలందిస్తామని వరుణ్‌సింగ్ హామీ ఇచ్చారని రవినాయుడు తెలిపారు. అనంతరం ఈఈపీసీ ఇండియా డిప్యూటీ డైరక్టర్ దీపక్ ఠాకూర్‌ను కలిసి రాష్ట్రానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్) నిధులు కేటాయించాలని కోరారు.



వరుణ్‌సింగ్‌ని కలిసిన రవినాయుడు

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు చర్యలు: కలెక్టర్

మహారాణిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచటంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు వి.ఆదిశేష, ఆర్డీవో వి.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు సాంకేతిక లోపం

▸ గంటల తరబడి స్టేషన్‌లో నిలిచిపోయిన రైలు ▸ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పడిగాపులు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే (12861) ఎక్స్‌ప్రెస్ రైలుకు సాంకేతిక లోపం ఏర్పడి గంటల తరబడి స్టేషన్‌లో నిలిచిపోయింది. విశాఖ నుంచి శుక్రవారం సాయంత్రం 6.40 గంటలకు బయలుదేరాల్సిన ఈ రైలు రాత్రి 9.00 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫామ్ నుంచి కదిలింది. ఈ రైలు కోచింగ్ కాంప్లెక్సు నుంచి నిర్ణీత సమయం ప్రకారం ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్‌కు చేరింది. అయితే ప్రయాణికులు కోచ్‌ల్లో ప్రవేశించి తమ బెర్తు/సీటులో కూర్చొన్నారు. నిర్ణీత సమయం ప్రకారం 6.40 గంటలకు బయలుదేరాల్సి ఉండగా...ఎటువంటి సమాచారం లేకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు స్టేషన్‌లో పడిగాపులు పడాల్సి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ రైలుకు చెందిన ఏసీ కోచ్‌లో (బి7) సాంకేతిక లోపం తలెత్తడంతో ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్‌కు చెందిన లైనులో పవర్ బ్లాక్ చేసి రైలును నిలిపివేసినట్లు తెలిసింది. సాంకేతిక లోపాన్ని సరిదిద్దడానికి సుమారు రెండున్నర గంటల సమయం పట్టడంతో ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పై గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మరమ్మతులు పూర్తయిన తర్వాత రాత్రి 9.00 గంటల సమయంలో రైలు ప్లాట్‌ఫామ్ నుంచి కదిలింది. రైలు ఆలస్యానికి సంబంధించిన సమాచారాన్ని స్టేషన్‌లో సమాచార కేంద్రం ద్వారా ఎప్పటికప్పుడు తెలియపరచకపోవడంతో ప్రయాణికులు గందరగోళానికి గురికావడమే కాకుండా రైల్వే సిబ్బంది తీరుపై అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ రైలు కదలకపోవడంతో నామినేషన్ ప్రకారం శుక్రవారం రాత్రి 8.30 గంటలకు ఎనిమిదో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి బయలుదేరాల్సిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) ఐదో నంబరు ప్లాట్‌ఫామ్ నుంచి నడపాల్సి వచ్చింది

23న దిశ సమావేశం

మహారాణిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న ఎంపీ భరత్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగే జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ మానటరింగ్ కమిటీ (దిశా) సమావేశానికి పక్కా నివేదికలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ముందుగా నివేదికలు సమర్పించాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వాటి మార్గదర్శకాలు ప్రయోజనాలపై సంపూర్ణ అవగాహనతో రావాలన్నారు.

మురళీనగర్‌లో నేడు రెవెన్యూ సదస్సు

మురళీనగర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్‌లో శనివారం ఉదయం 9 గంటలకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు. హైవే రోడ్డు శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానం సమీపంలోని 280వ నంబరు సచివాలయంలో జరిగే సదస్సులో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొంటారు. తహసీల్దారు, జీవీఎంసీ జోన్-5 జెడ్సీ, ఇతర అధికారులు వస్తారు. సాయంత్రం వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు భూ సమస్యలు, ఇతర దీర్ఘకాలిక ఇబ్బందులపై వినతులు అందించవచ్చు.

జోన్-4లో దుకాణాలు, మార్కెట్లకు బహిరంగ వేలం నేడు

అల్లిపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 పరిధిలోని కల్యాణ మండపాలు, దుకాణాలు, మార్కెట్లకు శనివారం బహిరంగ వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యాలయంలోని 4వ అంతస్తులో జరిగే వేలంలో పాల్గొనదలచినవారు ముందుగా సూపరింటెండెంట్‌ను కలిసి వివరాలు పొందవచ్చన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి: సతీష్‌కుమార్



ప్రసంగిస్తున్న సతీష్‌కుమార్, పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజం మెచ్చేలా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎలియన్స్ చైర్మన్ కొల్లా సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థుల స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాల సాకారానికి కృషి చేయాలన్నారు. సీనియర్ అధ్యాపకులు వీఎస్‌వీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి వ్యక్తిత్వ వికాస తరగతులు దోహదం చేస్తాయన్నారు. అకడమిక్ డైరెక్టర్ కార్తికేశ్వర్ పండా, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా కేవీ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న అతిథులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం వాల్తేరు వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తూర్పు కోస్తా రైల్వే డీఆర్ఎం మనోజ్ సాహుకు విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ప్రదర్శించిన నాటికలు, పాడిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం డీఆర్ఎం మనోజ్ సాహు మాట్లాడుతూ దేశ భవిష్యత్‌లో విద్యార్థుల పాత్ర కీలకమని, వారు పోటీతత్వాన్ని, కష్టపడే తత్వాన్ని అలవరచుకుని ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ కమల్‌జిత్ వార్షిక నివేదిక చదువుతూ కేవీలో జరుగుతునన్న వివిధ బోధన అభ్యసన పద్ధతులు, పీఎంశ్రీ కార్యక్రమాల కోసం వివరించారు. కార్యక్రమంలో నిధి గుప్తా, ఇందిరా నాయర్, సత్యనారాయణ, రవికుమార్, రాంబాబు, ప్రకాశరావు పాల్గొన్నారు.

ముస్లిం మైనారిటీల సమస్యలపై ఆరా



రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్‌ను శాలువాతో సత్కరిస్తున్న మహ్మద్ నజీర్ తదితరులు

మహారాణిపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్‌ను శుక్రవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షరీఫ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం షరీఫ్ జిల్లాలోని ముస్లిం మైనారిటీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాదిక్, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి మహ్మద్ జఫ్రుల్లా, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అనీఫ్, ఎస్కే రఫీ, యాసిన్, 14వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గొంపా ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు ఉద్యోగుల్లో క్రీడోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గేశ్‌కుమార్ దుబే

అక్కయ్యపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీలో 54వ అంతర విభాగ క్రీడోత్సవాలు డైమండ్ జూబ్లీ స్టేడియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశాఖపట్నం పోర్టు స్పోర్ట్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు, ఐఆర్‌టీఎస్ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్‌కుమార్ దుబే పోటీలు ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, బాడీ బిల్డింగ్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయి. ఇందులో పురుష, మహిళా ఉద్యోగులు, దివ్యాంగులు పాల్గొంటారు. ఔత్సాహికులంతా పాల్గొంటారు. విజేతలుగా నిలిచినవారికి వచ్చే ఏడాది జనవరి 26న బహుమతి ప్రదానం తో సత్కరిస్తారు. వార్షిక క్రీడోత్సవాలు విశాఖపట్నం పోర్టు అథారిటీ ఉద్యోగుల్లో శారీరక దారుఢ్యం, స్నేహభావం, సమగ్రతను పెంపొందించడంలో భాగంగా ఏటా పోర్టు యాజమాన్యం క్రీడలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఆలిండియా మేజర్ పోర్టుల స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడు టి.వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎస్.శివకుమార్, వీపీఎస్‌సీ విభాగాధిపతులు, అధికారులు విచ్చేశారు. అందరూ ఉత్సాహంగా క్రీడోత్సవాల్లో పాల్గొన్నారు.

'కొత్త ఆస్తి పన్ను విధానం రద్దు చేయండి'



కరపత్రాలు చూపిస్తున్న వార్వా నివాస్ ప్రతినిధులు

సీతమ్మధార, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను, ట్రూ అప్ చార్జీలు, టోల్ చార్జీలు, ప్రవేశరుసుములు వంటి అనేక రూపాల్లో విపరీతమైన భారం వేయడాన్ని నిరసిస్తూ, ప్రజల ఆస్తులైన స్టేడియాలు, పార్కులను ప్రైవేట్ వారి సొంతం చేసిన నిర్ణయాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వార్వా నివాస్ ప్రతినిధులు కరపత్రాలు విడుదల చేశారు. చార్జీలు తగ్గించాలని కోరుతూ సీతమ్మధార ఎంఎంటీసీ కాలనీలో వార్వా నివాస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పాల్గొన్న వార్వా జనరల్ సెక్రటరీ బి.బి. గణేష్, నివాస్ జనరల్ సెక్రటరీ పిట్ట నారాయణమూర్తిలు మాట్లాడుతూ అయిదేళ్లకు ఒకసారి కాకుండా ఇంటి పన్నును ఏటా పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్తుల విలువ, నిర్మాణ విలువలు పది నుంచి 20 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంవల్ల ఆస్తిపన్ను పెరుగుతుందని, ప్రజాకంటకంగా మారిన ఈ ఆస్తి పన్ను రద్దు చేసి ఇంటి పన్ను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. దీనిపై 10 వేల కరపత్రాలను పంచాలని నిర్ణయించామని, ఈ ఉద్యమానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వార్వా, నివాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అక్కయ్యపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే న్యూకాలనీలో ఓ వ్యక్తి (50) రోడ్డు దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం సాయిబాబా ఆలయం సమీపంలోని ఫుట్‌బాల్ మైదానం వద్ద రోడ్డు దాటుతుండగా, తాటిచెట్లపాలెం వైపు నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో కిందపడిపోయారు. అతని తలకు బలమైన గాయాలవడంతో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఎస్సై 9440796034, ఏఎస్సై 9848221183 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భూముల విలువ సవరణ

... 5వ పేజీ తరువాయి

రూ.13,500 చేశారు.

- కాకానినగర్‌లో గజం రూ.40 వేలు ఉండగా, మార్కెట్ రేటు రూ.75 వేలు పలుకుతోంది. దీనిని 12.5 శాతం పెంచి 45 వేలు చేయాలని ప్రతిపాదించారు.
- పీఎం పాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఎంవీవీ సిటీలో గజం స్థలం రూ.40 వేలు కాగా మార్కెట్ రేటు రూ.70 వేలు ఉంది. దీనిని 10 శాతం పెంచి రూ.44 వేలు చేశారు. అక్కడ ఫ్లాట్ కొంటే చ.అడుగు ధర రూ.4 వేలు ఉండగా మార్కెట్ విలువ రూ.7 వేలు పలుకుతోంది. దాంతో 5 శాతం పెంచి రూ.4,200 చేశారు.
- మధురవాడ వుడా రెవెన్యూ లేఅవుట్‌లో గజం ధర రూ.45 వేలు కాగా మార్కెట్ విలువ రూ.90 వేలు పలుకుతోంది. దాంతో 22 శాతం పెంచి రూ.55 వేలు చేశారు.
- చంద్రపాలెంలో గజం ధర రూ.30 వేలు కాగా మార్కెట్ రేటు రూ.55 వేలు పలుకుతోంది. 10 శాతం పెంచి రూ.33 వేలు చేశారు.
- సాయిప్రియా లేఅవుట్‌లో గజం రూ.35 వేలు కాగా మార్కెట్ రేటు రూ.60 వేలు ఉంది. దానిని 22 శాతం పెంచి రూ.44 వేలు చేశారు.
- బక్కన్నపాలెంలో గజం రూ.20 వేలు కాగా మార్కెట్ రేటు రూ.40 వేలు ఉంది. దీనిని 20 శాతం పెంచి రూ.24 వేలు చేశారు.
- కొమ్మాదిలో గజం రూ.18 వేలు కాగా మార్కెట్ రేటు రూ.35 వేలు ఉంది. దాంతో 17 శాతం పెంచి రూ.21 వేలు చేశారు.
- ఒమ్మివానిపాలెం (వాడపాలెం)లో గజం ధర రూ.18 వేలు కాగా మార్కెట్ ధర రూ.50 వేలు ఉంది. దాంతో 67 శాతం పెంచి రూ.30 వేలు చేశారు.
- పెదరుషికొండలో గజం రూ.22 వేలు కాగా మార్కెట్ రేటు రూ.50 వేలు ఉంది. దీనిని 36 శాతం పెంచి రూ.30వేలు చేశారు.
- గుడ్లవానిపాలెంలో గజం ధర రూ.24 వేలు కాగా మార్కెట్ రేటు రూ.50 వేలు ఉంది. 38 శాతం పెంచి రూ.33 వేలు చేశారు.
- ముడసర్లోవ ప్రాంతం ఇటీవల బాగా అభివృద్ధి చెందడంతో అక్కడ భూముల రేట్లు పెరిగాయి. కానీ కృష్ణాపురం, పైనాపిల్ కాలనీ ఏరియాల్లో గజం ప్రభుత్వ ధర రూ.14 వేలే ఉంది. మార్కెట్ రేటు 35 వేలు వరకు ఉంది. ఇక్కడ 43 శాతం పెంచి 20 వేలు చేశారు.
- ఆనందపురం మండలం పాలవలసలో వుడా అప్రూవల్ లేఅవుట్‌లో గజం రూ.3,700 ఉండగా మార్కెట్ రేటు రూ.8 వేలు ఉంది. దానిని 62 శాతం పెంచి రూ.6వేలు చేశారు.
- బోని గ్రామంలో గజం ధర రూ.950 మాత్రమే ఉంది. మార్కెట్ రేటు రూ.2 వేలు కాగా 58 శాతం పెంచి రూ.1,500 చేశారు.
- పద్మనాభం మండలం అమనాంలో ఎకరా భూమి ధర రూ.45 లక్షలు కాగా మార్కెట్ రేటు రూ.90 లక్షలు ఉంది. దీనిని 33 శాతం పెంచి రూ.60 లక్షలు చేశారు.
- చేపలుప్పాడలో ఎకరా ధర రూ.1.3 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.2.7 కోట్లు ఉంది. దీనిని 23 శాతం పెంచి రూ.1.6 కోట్లుకు ప్రతిపాదించారు.
- దాకమర్రిలో ఎకరా రూ.1.2 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.2.3 కోట్లు ఉంది. దానిని 23 శాతం పెంచి రూ.1.6 కోట్లు చేశారు.
- కాపులుప్పాడలో ఎకరా రూ.2.1 కోట్లు కాగా మార్కెట్ రేటు రూ.4.3 కోట్లు ఉంది. దానిని 19 శాతం పెంచి రూ.2.5 కోట్లకు పెంచారు.

వైసీపీకి వరుస షాక్‌లు

... 5వ పేజీ తరువాయి

కూడా కూడగట్టలేకపోయారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 23న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమానికి వైసీపీ నిర్ణయించింది. ఈలోగా 2024 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు ముఖ్య నాయకులు బయటకు వెళ్లిపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన ఆ పార్టీ నేతల్లో ఉంది. ఆయనతోపాటు డెయిరీలో డైరెక్టర్లుగా ఉన్న 12 మంది కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇక మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ కోలా గురువులు, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు వంటివారు పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు. మరికొందరు నేతలు కూడా పార్టీతో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

జీవీఎంసీ బడ్జెట్ రూ.4,554.27 కోట్లు

... 5వ పేజీ తరువాయి

ప్రాజెక్టుల ద్వారా రూ.560 కోట్లు, టౌన్‌ప్లానింగ్ ద్వారా రూ.312.26 కోట్లు, యూసీడీ ద్వారా రూ.15 కోట్లు, పార్కుల ద్వారా రూ.20 కోట్లు, ప్రజారోగ్యం ద్వారా రూ.22.59 కోట్లు, నీటి సరఫరా ద్వారా రూ.438.80 కోట్లు, అమృత్ ద్వారా రూ.300 కోట్లు, ఆర్థిక సంఘం ద్వారా రూ.450 కోట్లు, ఇతర ప్రాజెక్టుల కింద రూ.148 కోట్లు...మొత్తం ప్రారంభ నిల్వతో కలిపి రూ.4,709.15 కోట్లు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

... 5వ పేజీ తరువాయి

రోజులపాటు వారి సేవల పొడిగింపు అంశంపై కమిటీ సభ్యులు చర్చించారు. కార్మికులను ఎవరు నియమించారు?, వారికి వేతనాలను ఎవరి ద్వారా చెల్లిస్తున్నారని ప్రశ్నించారు. ప్రధాన వైద్యాధికారి గానీ ఆయా జోన్ల సహాయ వైద్యాధికారులుగానీ అందుబాటులో లేకపోవడంతో జోన్-6కి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఒకరు సమాధానం ఇచ్చారు. కార్మికులను ఎవరు నియమించారనేది తనకు తెలియదని, వేతనాలను మాత్రం స్వయం సహాయక సంఘాల ద్వారా జీవీఎంసీ చెల్లిస్తున్నట్టు చెప్పారు. తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపులో భాగంగా నోడల్ స్వయం సహాయక సంఘాలకు రెండు శాతం కమీషన్ ఎందుకు ఇస్తున్నారని అధికారులను స్టాండింగ్ కమిటీ సభ్యులు నిలదీశారు. ఆదాయ పన్ను కింద రెండు శాతం ఇస్తున్నందున అదనంగా సర్వీస్ చార్జీ పేరుతో మరో రెండు శాతం ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఐటీ కింద ఇచ్చే రెండు శాతం ఆయా సంఘాల ఖాతాల్లోనే ఉంటుంది కాబట్టి, సర్వీస్ చార్జీ పేరుతో ప్రత్యేకంగా కేటాయింపులు జరపడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఇకపై సర్వీస్ చార్జీ లేకుండా ఆదేశాలు ఇవ్వాలని మేయర్‌ను సభ్యులు కోరారు. అలాగే ఇప్పటికే పారిశుధ్య నిర్వహణకు 6,500 మందికిపైగా కార్మికులు ఉన్నందున, ఇకపై అవసరమైతే తప్ప రొటీన్‌గా వారి సేవలను పొడిగించాలంటే కుదరదని సభ్యులు స్పష్టంచేశారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి ఐఎన్ఎస్ డేగా రోడ్డుతో పాటు పోర్టు ఫ్లైఓవర్ బ్రిడ్జిలను శుభ్రం చేసే కార్మికులకు జీవీఎంసీ వేతనాలు చెల్లించడంపై సభ్యులు అధికారులను నిలదీశారు. పోర్టు అవసరాలు తీరుస్తున్న రోడ్ల నిర్వహణను జీవీఎంసీ చూడాలంటే సీఎస్ఆర్ కింద నిధులు రాబట్టాలని అధికారులకు సూచించారు. అలాగే గాజువాక నుంచి చెట్ల వ్యర్థాలు కాపులుప్పాడ యార్డుకు తరలింపు, గాజువాక జోన్‌లో వివిధ వార్డుల నుంచి చెత్త సేకరించే ఆరు వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి జీతాలు చెల్లించే అంశాలపై వివరణ ఇవ్వాలంటూ అధికారులను సభ్యులు కోరారు. దీనికి సంబంధిత అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. స్టాండింగ్ కమిటీ వంటి ముఖ్య సమావేశం జరిగితే అధికారులకు గైర్హాజరు కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై విభాగాల అధిపతులు సమావేశానికి హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని మేయర్‌ను కోరారు. కారుణ్య నియామకాలకు సంబంధించిన రెండు అంశాలు, గాజువాక జోన్‌లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే వాహనాల డ్రైవర్లకు వేతనాలు చెల్లించే అంశంతోపాటు జోన్-7లో ఆక్రమణలు, అనధికార ఫ్లెక్సీలు తొలగించడానికి ఐదుగురు అన్‌స్కిల్డ్ లేబర్‌ను ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించే అంశాలను వాయిదా వేయాలని తీర్మానించారు. మిగిలిన అంశాలను ఆమోదిస్తున్నట్టు మేయర్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, మెకానికల్ ఈఈ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో వాన

గాజువాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం ఉదయం నుంచి వర్షం తెరిపివ్వకుండా కురిసింది. దీంతో రోడ్లన్నీ బోసిపోయాయి. విధులకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం కొద్ది సమయం పాటు వర్షం తెరిపివ్వడంతో ప్రజలు బయటకు వచ్చారు. వర్షం నీరు సాఫీగా కాలువలో పోయే విధంగా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంతో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు కలగలేదు. గాజువాక రోజు వారీ మార్కెట్ బోసిపోయింది. అలాగే కూలీ పనులకు వెళ్లే వారు పనులు లేక మార్కెట్‌కు వచ్చి తిరిగి ఇంటి ముఖం పట్టారు.

ఎస్సీ ఉప కులాలకు న్యాయం చేయాలని వినతి



ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న రవీంద్రబాబు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : 2004లో ఎస్సీ వర్గీకరణను సుప్రీంకోర్టు రద్దు చేయటంతో ఎస్సీలోని ఉపకులాలకు 20 ఏళ్లుగా నష్టం జరిగిందని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి స్టీల్‌ప్లాంట్ నాయకులు లింగాల రవీంద్రబాబు పేర్కొన్నారు. ఈ నష్టాన్ని భర్తీ చేసేలా రిజర్వేషన్ల కోటాను రూపొందించాలని చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాను శుక్రవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రసాద శర్మకు సత్కారం



ప్రసాదశర్మను సత్కరిస్తున్న రాఘవాచార్యులు, తదితరులు

పెదగంట్యాడ,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో పేరుగాంచిన భాస్కరభట్ల ప్రసాదశర్మను సంగీత మాధురి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు ఘనంగా సత్కరించారు. చినగంట్యాడ త్రిశక్తి ఆలయ మండపంలో మూడు రోజుల పాటు జరిగిన సంగీత సాహిత్య, నృత్య పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన ప్రసాదశర్మను సత్కరించారు. కార్యక్రమంలో సంగీత మాధురి ప్రధాన కార్యదర్శి అప్పారావు, అమ్మాజీ పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కోయంబత్తూరులో జరిగిన 62వ జాతీయ రోలర్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను గురువారం స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ వంశీకృష్ణ అభినందించారు.

సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 20, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 48, బెండకాయలు 44, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 28, క్యారెట్ 40 దొండకాయలు 44, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 140, అల్లం (పాతది)56, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 56, కీరదోస 36, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండచిసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	100
ఫారం ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

ముసురుతో జనజీవనం అస్తవ్యస్తం

- రహదారులు జలమయం
- పొంగుతున్న డ్రైనేజీలు
- కూలీలు, చిరు వ్యాపారులు ఇంటికే పరిమితం
- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు

కూర్మన్నపాలెం,డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో గత 2 రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండంతో ఈ ప్రాంతంలో జనజీవనం ఇబ్బందిగా మారింది. గురువారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జీవీఎంసీ 70వ వార్డులోని ఎల్వీ నగర్, కుంచుమాంబ కాలనీ, 71 వార్డు ఆటోనగర్‌లో ఐలా, వాసీవా కార్యాలయం, తోకాడ, ఎంఎస్‌ఎంఈ కార్యాలయం రహదారుల్లో వర్షం నీటితో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అలాగే 86, 87 వార్డుల్లో వడ్లపూడి, సిద్ధార్థ నగర్ వాటర్ ప్లాంట్, ఫకీర్‌తఖ్యా, రాజీవ్ నగర్, రాసాలమ్మ కాలనీ, ఎన్టీఆర్ నగర్, కణితి, వడ్లపూడి, ఉప్పర కాలనీ, యాతపాలెం, కాపు జగ్గరాజు పేట, రేడియో స్టేషన్ రోడ్, సాయిరాం నగర్ రహదారులపై వర్షం నీరు వరదలా ప్రవహిస్తోంది. ప్రధాన డ్రైనేజీ కాలువలు వర్షం నీటితో పొంగి పొర్లాయి. కాలువలలోని వ్యర్థాలు రోడ్లపైకి చేరుకున్నాయి. కాలనీల్లో ఎటు వైపు చూసినా నీరు నిలిచి చెరువును తలపిస్తుండడంతో ప్రయాణికులు, వాహన చోదకులు, పాదచారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. దువ్వాడ నుంచి మంగళపాలెం, కూర్మన్నపాలెం, కాపు జగ్గరాజుపేటల మీదుగా జాతీయ రహదారికి వెళ్లే ప్రధాన రహదారి మార్గంపై వర్షం నీరు నిలిచి ఆయా కాలనీ వాసులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.



కూర్మన్నపాలెం : ఆటోనగర్ ఎంఎస్‌ఎంఈ కార్యాలయం ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు



అగనంపూడి : కురుస్తున్న వర్షం

అగనంపూడిలో భారీ వర్షం

అగనంపూడి : అగనంపూడి, పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకూ ముసురు వాతారణం నెలకొంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వర్షం ఎడతెరిపి ఇవ్వకపోవడంతో రోజువారీ కూలీలు, కార్మికుల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలామంది కూలీలు, చిరు వ్యాపారులు ఇంటికే పరిమితం అయ్యారు. కొందరు గొడుగుల సాయంతో పనులకు వెళ్లాల్సి వచ్చింది. జాతీయ రహదారి అగనంపూడి ఆస్పత్రి వద్ద డ్రైనేజీ పొంగి ప్రవహించింది. అలాగే అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే మార్గంలో స్థానిక కోళ్ల ఫారాల వద్ద రహదారి నీటితో మునిగింది. అలాగే నిర్వాసిత దిబ్బపాలెం రహదారిపై నీరు నిలిచిపోయింది. మంచినీటి పైపులైన్లు కోసం తవ్విన గోతులను సరిగా పూడ్చివేయకపోవడంతో వీధి రోడ్లు బురద మయం అయ్యాయి. నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పెదగంట్యాడ : వర్షం నీరు నిలిచి బురదమయంగా తయారైన ఆటోనగర్ ప్రధాన రహదారి

పెద గంట్యాడలో..

పెదగంట్యాడ : గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు, వీధి రోడ్లలో వర్షపునీరు నిలిచింది. కాలనీలు చిత్తడిగా మారాయి. రోడ్లు బురదమయంగా తయారయ్యాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న రామచంద్రానగర్, రిక్షా కాలనీ, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, బాలచెరువు, సీతానగరం ప్రాంతాలు జలమయమయ్యాయి. జీవీఎంసీ 54వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ కాలనీ, సత్యనారాయణపురం, 65వ వార్డులోని కొత్తదిబ్బపాలెం కాలనీ రోడ్లపై ప్రవహించింది. అలాగే 75వ వార్డులోని చినకోరాడ, ముసలినాయుడుపాలెం కాలనీల్లో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వెంకటాద్రి కొండపై ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

వేపగుంట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 94వ వార్డు కృష్ణానగర్ గుడి వీధిలో కొలువైన దుర్గా మల్లేశ్వర సహిత అయ్యప్ప స్వామి ఆలయంలో దుర్గాదేవికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

పెందుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు అన్నారు. రాంపురంలో శుక్రవారం క్రెడా ఆధ్వర్యంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.కార్యక్రమంలో ఎన్‌జీవో పీఆర్‌వో నాగేశ్వరరావు, కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌ఏడీ ఉద్యోగుల దీక్ష

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఏడీ యాజమాన్యం అన్యాయంగా తొలగించిన 36 మంది ఉద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎన్ఏడీ ఉద్యోగులు చేపట్టిన సత్యాగ్రహ దీక్ష శుక్రవారం కూడా కొనసాగింది.ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ఎన్ఏడీ సీజీఎం నిరంకుశ వైఖరిని ఖండించారు. ఒకేసారి 36 మంది ఉద్యగుల సస్పెండ్, ఆరుగురిపై క్రిమినల్ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ శనివారం రాత్రి జరిగే జనజాగరణ, ఆదివారం నిర్వహించే వంటవార్పు కార్యక్రమాల్లో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మౌలాలీ, ఏవీ థామస్, బి. అంజనేయులు, అచ్యుతరావు, బి. నాగభూషణరావు, యూనియన్ అధ్యక్షుడు పి.రాజు, కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో ఎమ్మెల్యే గణబాబు శనివారం సామాజిక భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈమేరకు అధికారులు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ఇందిరానగర్ వద్ద జారి పడిన కొండచరియ



నీటితో కళకళలాడుతున్న మేహాద్రి గెడ్డ జలాశయం

తెరిపివ్వని వాన

- ఏకధాటిగా కురుస్తున్న వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం

గోపాలపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించింది. వర్షాలకు తోడు చల్లని గాలులు వీస్తుండడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే గోపాలపట్నం ప్రధాన రహదారి ముసురు దెబ్బకు వెలవెలబోయింది. బుధవారం సాయంత్రం నుంచి తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. గోపాలపట్నం కొండవాలు ప్రాంతమైన ఇందిరానగర్‌లో బైపాస్ రహదారి కోసం తవ్వకాలు చేపట్టి రిటైనింగ్ నిర్మించకుండా విడిచిపెట్టిన చోట కొండచరియ జారిపడింది. దీంతో ఎగువ ప్రాంతంలో ఉన్న ఇంటి ప్రహరీ జారిపడింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం నుంచి వర్షం ఏమాత్రం తెరిపివ్వకపోవడంతో ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపార సముదాయాలతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా డీలా పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్ మార్కెట్ జనాలు లేక వెలవెలబోయింది. రోజు వారీ కూలీలు ఉపాధి కోల్పోయారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసేవారు ఇళ్లకే పరిమితమయ్యారు. కొన్నిచోట్ల దుకాణదారులు షాపులు తెరవలేదు.

కొండవాలు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

ఎన్ఏడీ జంక్షన్ : జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో వర్షాలకు దెబ్బతిన్న కొండవాలు ప్రాంతాలను జెడ్సీ కె. హైమావతి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్రవారం పరిశీలించారు. ఒక ప్రాంతంలో ఇంటి ముందు భాగం కుంగిపోయింది. వర్షాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కార్పొరేటర్ రమణ కోరడంతో జెడ్సీ ప్రాథమిక పాఠశాలలో వసతి ఏర్పాటు చేయా లని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ చిరంజీవి, టీడీపీ నాయకులు శ్రీను పట్నాయక్, దుర్గాప్రసాద్, చిన్న వెంకటలక్ష్మీ, జ్యోతి, రాధ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

పెందుర్తి : అల్పపీడనం రైతుల ఆశలను ముంచింది. పంట మునిగి కన్నీరు మిగులుస్తోంది. రెండు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని అనేక గ్రామాల్లో కోసిన వరిపంట నీట మునిగింది. పది రోజుల కిందట కురిసిన వర్షాలు, గాలల ప్రభావంతో వరి చేను నేలకొరిగింది. దీంతో రైతులు కోతలు ప్రారంభించారు. కాగా కనీసం గాలి కుప్పలు కూడా వేయకముందే మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో పనలన్నీ నీటిలో నానుతున్నాయి. దీంతో ఈ ఏడాది పంట చేతికి అందకుండానే పోతుందని ఆందోళన చెందుతున్నారు. పినగాడి, గొరపల్లి, ముదపాక, నరవ, రాజయ్యపేట, సరిపల్లి ప్రాంతాల్లో వరి పైరు నీట మునిగింది. కాగా శుక్రవారం పెందుర్తిలో 27.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

నిండుకుండలా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్

గోపాలపట్నం : మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం 58 అడుగులకు చేరింది. రిజర్వాయర్ గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 61 అడుగులు కాగా 59 అడుగులకు చేరగానే నీటిని దిగువకు విడిచిపెట్టడంతో 57.5 అడుగులకు చేరింది. రెండు నెలలుగా స్థిరంగా ఉంది. ప్రస్తుత వర్షాలకు 58 అడుగులకు చేరింది. మరో అడుగు పెరిగితే గేట్లు తెరిచే అవకాశం ఉంటుందని సిబ్బంది తెలిపారు.

ఆక్రమణలో చెరువులు, కాలువలు

రెవెన్యూ సదస్సులో రైతుల ఫిర్యాదు

పెందుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న వ్యవసాయ భూములను తప్పుడు పత్రాలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు దోచేస్తున్నారని, చెరువులు, కాలువలను కూడా ఆక్రమిస్తున్నారని గొరపల్లి గ్రామానికి చెందిన రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గొరపల్లిలో రెవెన్యూ అధికారులు శుక్రవారం సదస్సు నిర్వహించారు, ఈసందర్భంగా ఎన్‌హెచ్ 16 ఎస్‌డీసీ జె.సీతారామారావు ఎదుట రైతులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. సర్వే నెంబరు 218లో దశాబ్దాలుగా రైతుల ఆధీనంలో ఉన్న 70 ఎకరాల వ్యవసాయ భూములకు ఇతర జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు తప్పుడు పత్రాలు సృష్టించి, భూ దోపిడీకి పాల్పడుతున్నారని చెప్పారు. రెవెన్యూ రికార్డుల్లో రైతుల పేర్లు మాయం చేసి, రిజిస్ట్రేషన్లు జరగనీయకుండా అడ్డుపడుతున్నారన్నారు. ఈ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే గొరపల్లి, రాంపురం సరిహద్దులో ఉన్న జామివాని చెరువు కాలువ ఆక్రమణలను తొలగించాలని విన్నవించారు. గొరపల్లిలో సర్వే నంబరు 10లో ఉన్న 134 ఎకరాల చెరువు కూడా కబ్జాకు గురవుతుందన్నారు. అనంతరం ఎస్‌డీసీ రైతుల ఆధీనంలో వున్న సాగు భూములను పరిశీలించారు. జామివాని చెరువు ఆక్రమణలను తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు కాగా సదస్సులో 18 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు సర్పంచ్ గొరపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జామి గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమ్మె విరమణ తాత్కాలికమే : సీఐటీయూ నేత నర్సింగరావు



మాట్లాడుతున్న నర్సింగరావు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజోతి) : విశాఖ డెయిరీ యాజమాన్యం పలు సమస్యల పరిష్కారానికి అంగీకరించడంతో కార్మికులు చేపట్టిన నిరాహార దీక్షలకు తాత్కాలిక విరామణ ఇచ్చామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖ డెయిరీ వద్ద శుక్రవారం జరిగిన డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరసన విరమించినప్పటికీ సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మాట తప్పితే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలకు అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లాలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్యారమ్స్ పోటీలకు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్టు స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టి.డిల్లీశ్వరి, సీహెచ్ కుమారి, ఎ.కోమలి, పి.దీక్షిత, బి.అక్షయ, కె. హరిప్రియ రాష్ట్రసాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. శుక్రవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం, వ్యాయామ ఉపాధ్యాయురాలు మహ్మద్ ఇస్మాయిల్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

జోరుగా బీజేపీ బూత్ కమిటీల ఆన్‌లైన్ ప్రక్రియ

గాజువాక, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలో ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీజేపీ బూత్ కమిటీల ఆన్‌లైన్ ప్రక్రియను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలో ఉన్న 309 పోలింగ్ బూత్‌లలో ప్రతి బూత్‌కు 12 మందితో కూడిన కమిటీని ఆన్‌లైన్ సరల్ యాప్‌లో ఆన్‌లైన్ చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 25లోగా మండల కమిటీలను ప్రకటిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకాల గురించి కార్యకర్తలు ప్రచారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రంగనాయకులు, రాజశేఖర్, జగదీష్, రామస్వామి, మనోహర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు వినతి

అగనంపూడి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధిలో గల అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీలతో పాటు పరిసర ప్రాంత గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఇంటింటికీ నీటి సరఫరాను తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ జీవీఎంసీ మంచినీటి విభాగం ఈఈ సీహెచ్ ఏడుకొండలను స్థానికులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఈఈ సానుకూలంగా స్పందించారు.



దేశభక్తుల వేషధారణలో అంగన్‌వాడీ, భవితా చిన్నారులు

పిల్లల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదే

కూర్మన్నపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను చిన్ననాటి నుంచి దేశభక్తి, తల్లిదండ్రుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండేలా తీర్చిదిద్ది, వారిని ఉత్తమ భావి భారత పౌరులుగా రూపొందించే బాధ్యత ఉపాధ్యాయులేనని ఎంఈవో సునీత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పేర్కొన్నారు. జీవీఎంసీ 87 వార్డు వడ్లపూడిలో శనివారం వీఎస్ఈజెడ్-హెచ్‌బీఎల్ ప్రతినిధులు ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గ పరిధిలో దత్తత తీసుకున్న 15 అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం, వసతులు, పలు పుస్తక సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు దేశభక్తులు, వివిధ మతాలు,వివిధ గౌరవప్రద వృత్తుల వేషధారణలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ ప్రతినిధులు ఎస్ఆర్ అనీస్, హెచ్ఆర్ శ్రీకాంత్, సంతోష్, వెంకట రత్నం,సత్యన్నారాయణ, సూర్యారావు, స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు,రాజన్‌రాజు, శ్రీనివాస వర్మ, అంగన్వాడీ టీచర్లు, విద్యార్థులు, హెచ్‌బీఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గుడివాడ అప్పన్నకు నివాళి



అప్పన్నకు నివాళులు అర్పిస్తున్న అమర్‌నాథ్, చింతలపూడి తదితరులు

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మాజీ ఎమ్మెల్యే గుడివాడ అప్పన్న నేటి తరం నాయకులకు ఆదర్శప్రాయులని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మిందిలో శుక్రవారం నిర్వహించిన గుడివాడ అప్పన్న 46వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, అప్పన్న ట్రస్టు చైర్మన్ గుడివాడ అప్పలరామూర్తి, గుడివాడ లతీశ్, వో వెంకటరావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐని కలిసిన టీడీపీ నేతలు

పెదగంట్యాడ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ శాంతి భద్రతల విభాగం సీఐగా బాధ్యతలు స్వీకరించిన తోకాడ కామేశ్వరరావును విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, జీవీఎంసీ 75వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, సమన్వయకర్త ములకలపల్లి పెంటయ్యలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలుతో సత్కరించి పూలమాలలు వేశారు. వీరితో పాటు టీడీపీ నాయకులు నమ్మి అప్పారావు, నంబారు సింహాద్రి, మొల్లిరమణ, కాకినాడ అప్పలరాజు, దొమ్మేటి పెరుమాళ్లు ఉన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు



అగనంపూడి, డిసెంబరు, 20 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు.

జగనన్న కాలనీ రోడ్డు బురదమయం



బురదమయమైన జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు

పెందుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాలిమెరక జుత్తాడలో జగనన్న కాలనీకి వేసిన రోడ్డు బురదమయంగా మారింది. దీంతో నివాసితులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.ఈ కాలనీలో వాలిమెరక, పెదగాడి గ్రామాలకు చెందిన 327 మందికి ఇళ్లు మంజూరు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మించకుండానే కాలనీని అట్టహాసంగా ప్రారంభించి, లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. కాలనీకి వెళ్లేందుకు సుమారు 2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టగా,బిల్లులు రావని తెలిసి కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. దీంతో కాలనీవాసులు వర్షం పడిన ప్రతిసారి రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు.

కూటమి పాలనలో ముస్లింలకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షరీఫ్

పెందుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :కూటమి పాలనలో ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని శాసన మండలి మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు షరీఫ్ అన్నారు. శుక్రవారం పెందుర్తిలోని ప్రశాంతి నగర్‌లో పోర్ట్ కల్యాణ మండపంలో జరిగిన ఇండియన్ ముస్లింల మైనార్టీ రాష్ట్ర నూర్బాషా దూదేకుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీలో ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. షేక్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి జమాల్ ఖాన్, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు షేక్ పీర్ మహ్మద్, రాష్ట్ర యువజన ముస్లిం సంఘం ప్రతినిధి షేక్ షఫీ ఉల్లా బాబన్, మస్తానమ్మ, సుభాన్,మస్తాన్ ఖాదర్ బాషా, ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జీ, ఆహ్వాన కమిటీ చైర్మన్ ఖాన్ పాల్గొన్నారు.

పగిలిన తాగునీటి పైప్‌లైన్

మల్కాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రీయల్ కాలనీలో తాగునీరు సర ఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ గురువారం అర్ధరాత్రి పగిలిపోవడంతో మల్కాపురం పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేయకపోవడంతో మహిళలు బోర్లు వెంట పరుగు తీశారు. శుక్రవారం నాటికి పైప్‌లైన్ మరమ్మతు పూర్తి కాలేదు. శనివారం ఏ సమయానికి నీరు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూములపై ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మల్కాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో ఆక్రమణలపై ములగాడ మండల తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, సచివాలయ వీఆర్‌వోలు శుక్రవారం సర్వే నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఆక్రమణలను గుర్తించారు. 'జోరందుకున్న ఆక్రమణలు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి తహసీల్దార్ భుజంగరావు స్పందించారు. ఈమేరకు రెవెన్యూ సిబ్బందిని పంపించి ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఆరా తీశారు. ప్రధానంగా రామకృష్ణాపురం గ్రీన్ బెల్ట్ ప్రదేశంలో ఉన్న ఆక్రమణలను పరిశీలించి, తక్షణమే తొలగించాలని ఆదేశించారు.

ఈ-శ్రమ్‌తో కార్మికులకు భరోసా

పరవాడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నది. వారికి సామాజిక భద్రతతోపాటు కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు 'ఈ-శ్రమ్' కార్డులను జారీ చేస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు సాయం అందించడం, ఉపాధి కల్పనకు ఇది దోహదపడుతుంది..ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులు ఎవరైనా ప్రమాదవశాత్తూ మరణిస్తే బాధిత కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు పరిహారం అందుతుంది. ప్రమాదంలో 50 శాతానికి మించి అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష వరకు ఆర్థిక సాయం పొందవచ్చు. అనివార్య కారణాల వల్ల కార్మికులు ఎవరైనా ఉపాధి కోల్పోతే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తారు.

- అసంఘటితరంగాల్లో వారికి ఎంతో మేలు
- ప్రమాదవశాత్తూ మృతిచెందితే బాధిత కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం
- 50 శాతానికిపైగా గాయపడితే రూ.లక్ష వరకు పరిహారం
- పేర్లు నమోదుకు పలుచోట్ల అందుబాటులో సేవలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)



ఈ-శ్రమ్ కార్డు నమూనా

ఎవరు అర్హులు?

భవన నిర్మాణ కార్మికులు, చిరువ్యాపారులు, దుకాణాల్లో పనిచేసే వారు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, పౌల్ట్రీ ఫారాల్లో పనిచేసేవారు, జాబ్‌కార్డు ఉన్న ఉపాధి కూలీలు, వీధి వ్యాపారులు, చేతివృత్తిదారులు, వివిధ రకాల కులవృత్తిదారులు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కలాసీలు, ఆటో/రిక్షా కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవచ్చు. 18 నుంచి 59 ఏళ్ల లోపువయసుండి, నెలకు రూ.15 వేలకన్నా తక్కువ ఆదాయం వుండి, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం లేని వారు అర్హులు.

ఈ-శ్రమ్‌లో ఎలా నమోదు చేసుకోవాలంటే..

ఈ-శ్రమ్‌లో పేర్లు నమోదుకు కామన్ సర్వీస్ సెంటర్, మీ-సేవా కేంద్రాలు, సచివాలయాలు, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు. కార్మిక శాఖ కార్యాలయాల్లో లేబర్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ-కేవైసీ కలిగిన ఆధార్, దీనికి అనుసంధానమైన ఫోన్ నంబర్ వున్న మొబైల్ తీసుకొని కేంద్రాలకు వెళ్లాలి. ఈ-శ్రమ్ కార్డు పొందినప్పటికీ దీనికి సంబంధించిన ప్రయోజనాలు అందకపోతే 14434 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు.

గ్రామాల్లో అవగాహన సదస్సులు

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ-శ్రమ్ కార్డులు కార్మికులకు భరోసా కల్పిస్తాయి. దీనిని కార్మికులంతా సద్వినియోగం చేసుకోవాలి. ఈ-శ్రమ్‌లో నమోదు కోసం గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఈ-శ్రమ్ కార్డులు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేస్తున్నాం.

- కె.వసంతరావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్, అనకాపల్లి



ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్డీఏలో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మానవవనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు యూవీఎస్ఆర్ ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు రవిశంకర్ శుక్రవారం విజయవాడలోని మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ఉగాది సంబరాలు నిర్వహించండి

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి 29న విశాఖలో ఉగాది సంబరాలు నిర్వహించాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌ను ఏపీ టూరిజం ఫోరం సెక్రటరీ పవన్ కార్తీక్ కోరారు. శుక్రవారం ప్రభుత్వ అతిథిగృహంలో మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. విశాఖలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వారాంతపు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశాఖ ఉత్సవ్ తేదీ ప్రకటించాలని కోరారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న పవన్ కార్తీక్

నేడు మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సెలింగ్

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మునిసిపల్ పాఠశాలల్లో ఖాళీగా స్కూలు అసిస్టెంట్ ఖాళీల భర్తీకి శనివారం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. పదోన్నతి పొందినప్పటికీ ప్రస్తుతం పనిచేసే చోటే వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు బోధించాల్సి ఉంటుంది. టీచర్లకు ఇంక్రిమెంట్లు వస్తాయిగాని కొత్త పాఠశాలలకు పంపరు. దీంతో ఈ ప్రక్రియను పేపరు పదోన్నతులగా పలువురు టీచర్లు అభివర్ణిస్తున్నారు. కాగా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు 34 ఖాళీలు ఉండగా రెండు రోజుల క్రితమే సీనియారిటీ జాబితా విడుదలచేశారు. అత్యధికంగా తెలుగు 13, బయాలజీలో ఆరు, ఇంగ్లీష్, సోషల్‌లో నాలుగు, గణితం, హిందీలో మూడేసి, ఫిజికల్ సైన్స్‌లో ఒక ఖాళీ ఉంది. తెలుగులో అర్హత కలిగిన టీచర్లు ఐదుగురే ఉన్నారు. కౌన్సెలింగ్ ముందు ధ్రువపత్రాలు పరిశీలిస్తామని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. పోస్టింగ్ పొందిన వారంతా ప్రస్తుత పాఠశాలల్లోనే పనిచేసి, చివరి పనిదినం రోజున కొత్త పాఠశాలలకు వస్తారన్నారు.

'మధ్యవర్తిత్వంతోనే ఎక్కువ కేసుల పరిష్కారం'

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ వివాదాలు పరిష్కరించాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వ శిక్షణ పొందుతున్న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల న్యాయాధికారులనుద్దేశించి మాట్లాడారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కక్షిదారులకు సరైన మార్గదర్శకాలు అందించి, ఎక్కువ కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. సివిల్, కుటుంబతగాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు మధ్యవర్తిత్వ కేంద్రానికి ఎలా పంపాలో వివరించారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీకి చెందిన శిక్షకులు నగీన జైన్, నేనాఖరే మాట్లాడుతూ మధ్యవర్తిత్వ కేసుల పరిష్కారంపై సూచనలందించారు.

జాబ్‌మేళాకు 226 మంది హాజరు

కంచరపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించిన జాబ్‌మేళాకు నగరం సహా వివిధ ప్రాంతాల నుంచి 226 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరికి మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు మౌఖిక పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రాలను పరిశీలించారు. మేధా సర్వో డ్రైవ్స్‌తో పాటు 5 ప్రముఖ సంస్థలు మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేశాయి. తుది జాబితాను సోమవారం వెల్లడిస్తామని ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. మేళాలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఆటో మొబైల్ తదితర కోర్సులు పూర్తిచేసిన యువత పాల్గొన్నారు.

తెలుగు భాషను కాపాడుకుందాం

» పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేశ్

సీతంపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను కాపాడుకోవడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ పిలుపునిచ్చారు. మాతృభాషను కాపాడుకోవడానికి అందరూ కృషి చేయాలని కోరారు. త్వరలో ఒక కార్యాచరణను రూపొందించుకొని తెలుగు భాషను, జానపద కళలను సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ఇందుకు సుప్రసిద్ధ తెలుగు రచయిత పరవస్తు చిన్నయసూరి ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు సాగుదామన్నారు. పౌరగ్రంథాలయంలో పరవస్తు విద్యా పీఠం ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నయసూరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కందుల దుర్గేశ్ చిన్నయ సూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ వేడుకల్లో పాల్గొనడం పురస్కారం లభించినంత ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు. పద్యానికి నన్నయ, గద్యానికి చిన్నయ అనే లోకోక్తిని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు ఆవశ్యకతను మంత్రి వ్యక్తపరిచారు. నేటి తరం పిల్లలకు తెలుగు పద్యాలు నేర్పడమే లక్ష్యంగా పరవస్తు చిన్నయ సూరి మునిమనవడు పరవస్తు ఫణిశయన సూరి పరవస్తు విద్యాపీఠం ఏర్పాటు చేశారని ప్రశంసించారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయని తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త పేరి రవికుమార్‌ను మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పలువురు ప్రముఖులు, పరవస్తు చిన్నయ సూరి అభిమానులు పాల్గొన్నారు.



పేరి రవికుమార్‌కు పరవస్తు చిన్నయసూరి పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఇతర ప్రతినిధులు

27 నుంచి నృత్య శిఖరాగ్ర సమావేశం

విశాఖపట్నం: నృత్య శిఖరాగ్ర సమావేశం ఐటీడీసీ-2024 పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం విశాఖపట్నంలో ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజులు విశాఖలో ఈ సమావేశాలు జరుగుతాయని ఐటీడీసీ వ్యవస్థాపకులు, సమావేశ నిర్వాహకులు బత్తిన విక్రమ గౌడ్ తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజులు సమావేశాలు నిర్వహించి, గ్రాండ్ ఫినాలే ఏఎంజీ పార్కులో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు, కళాకారులను ఘనంగా సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రైటర్స్ అకాడమి చైర్మన్ వీవీ రమణమూర్తి, పర్యాటక శాఖ జిల్లా అధికారిణి జ్ఞానవేణి పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 8 ఫిర్యాదులు

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందాయి. కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, సీసీపీ ప్రభాకర్, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. తీరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన సీహార్స్, బేవాచ్, విరాగో రాడిసన్ బ్లూ ప్రాజెక్టులపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. రామకృష్ణాపురంలో తొలగించిన షెడ్డులు తిరిగి నిర్మిస్తున్నారన్నారు. డైమండ్ పార్కు, రిజర్వు పార్కు, రేవళ్లపాలెం, నగరపాలెం, సీబీసీఎన్‌సీ టీడీఆర్ బాండ్లపై విచారణ జరపాలని, 22వ వార్డు పిఠాపురంలో 100 గజాలు కబ్జాలో ఉందని, వీఐపీ రహదారిలో 420 గజాల స్థలం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. రెండు, మూడు, ఐదు జోన్లకు సంబంధించి రెండేసి, 4, 8 జోన్‌కు ఒకటి చొప్పున ఫిర్యాదులందాయి. వాటిని పరిష్కరించాలని కమిషనర్ ఆదేశించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జీవీఎంసీ కమిషనర్

26 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లోని కాజీపేట, విజయవాడ సెక్షన్‌లలో మూడో లైను నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 26 నుంచి పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడపనున్నట్టు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519)కు ఈ నెల 26 నుంచి జనవరి 8 వరకూ కాజీపేట స్టేషన్‌లో హాల్ట్ ఉండదు. విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20833)కు జనవరి 8, 9 తేదీల్లో ఖమ్మం, వరంగల్ స్టేషన్లలో హాల్ట్ ఉండదు. ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), తిరుగు ప్రయాణంలోని భువనేశ్వర్-ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) రైళ్లకు జనవరి 6 నుంచి 8 వరకు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం టౌన్, మధిర స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045)కు జనవరి 6 నుంచి 8 వరకు, హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046)కు జనవరి 7 నుంచి 9 వరకూ ఖమ్మం టౌన్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట, జనగామ, ఆలేరు, భువనగిరి స్టేషన్లలో హాల్ట్ ఉండదు. షాలిమార్-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22849)కు జనవరి 1, 8 తేదీల్లో వరంగల్, కాజీపేట స్టేషన్లలో, సికింద్రాబాద్-షాలిమార్ సూపర్‌ఫాస్ట్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774)కు జనవరి 7న వరంగల్, రాయనపాడు స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

మిషన్ శక్తిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిషన్ శక్తి పథకం అమలుపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పనిచేసే మహిళల వసతి గృహాలు, శక్తిసదన్, సఖి వన్‌స్టాప్ సెంటర్ పనితీరు తెలుసుకున్నారు.కిశోర వికాసంపైజిల్లా, మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను అధికారులు కలెక్టర్‌కు తెలియజేశారు.

నేటి నుంచి పెట్రో వర్సిటీలో శిక్షణ

» ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన



సమావేశంలో ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన, ఇతర అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (ఐఐపీఈ) సామాజిక బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఈ నెల 21 నుంచి 23 వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు పెట్రో వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన పేర్కొన్నారు. ఏయూలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అధునాత ల్యాబొరేటరీల్లో పరికరాలు, పనితీరుపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ అంశాలపై పరిశోధనలు సాగించేలా శిక్షణ ఉంటుందన్నారు. రెండు రకాలైన శిక్షణ కోసం అనకాపల్లి, విశాఖ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు, 25 మంది ఉపాధ్యాయులు/అధ్యాపకులను ఎంపిక చేశామన్నారు. పెట్రో వర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ లోకల్ కాలేజీ అండ్ స్కూల్ స్టూడెంట్స్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులను శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణానంతరం సైన్స్ పరిశోధనలకు సంబంధించిన మెటీరియల్ కొనుగోలుకు రూ.2 వేల చొప్పున అందిస్తామన్నారు. కో-ఆర్డినేటర్లు పొలమరశెట్టి అపరారా య్, ప్రొఫెసర్ రంధి రామినాయుడు మాట్లాడుతూ అధ్యాపకులు, ఉపాధ్యాయులకు అధునాతన ల్యాబ్‌లపై అవగాహన కల్పిస్తామన్నారు.

కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా తీవ్రంగా కోతకు గురవుతున్న సముద్ర తీర ప్రాంతాన్ని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఆర్కే బీచ్ రోడ్డులో నోవాటెల్ ఎదురుగా పాప చిల్డ్రన్ పార్కు పరిశీలించి, మాట్లాడుతూ తుపాను కారణంగా అలల ఉధృతికి కొంతమేర కోతకు గురైందన్నారు. తగిన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులు బీచ్‌లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు సూచించారు.



ఆర్కే బీచ్‌వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

లోతట్టు వాసులను అప్రమత్తం చేయండి

అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున లోతట్టు, కొండవాలు, ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని కమిషనర్ అధికారులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ప్రతి అధికారి సంబంధిత ప్రాంతాల్లో నిత్యం పరిస్థితులను గమనించాలన్నారు. కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఆయా ప్రాంతాల వాసులను ప్రజలను పునరావాస కేంద్రాలను తరలించేలా చర్యలు చేపట్టాలని యూసీడీ-ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణిని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను తరలించిన వారికి భోజనం, తాగునీరు, వైద్య సదుపాయం, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మల్కాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టరును హత్య చేసిన కేసులో ఇద్దరు ముద్దాయిలకు జీవిత ఖైదు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ గాజువాక అడిషనల్ కోర్టు న్యాయమూర్తి జి.షణ్ముఖరావు శుక్రవారం తీర్పునిచ్చారు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీహరిపురం జవహర్‌నగర్‌కు చెందిన నేవల్ కాంట్రాక్టరు సందీప్ బిశ్వాస్ వద్ద కారు డ్రైవర్‌గా తిరుపతిరావు పనిచేస్తుండేవాడు. సెప్టెంబరు 30, 2011లో కారులో బయటకెళ్లారు. అప్పటికే కాంట్రాక్టర్‌ను చంపాలని ప్లాన్ చేసుకున్న తిరుపతిరావు మిత్రుడు దల్లి చిరంజీవి సహకారంతో కారు అద్దాలు వేసి, ప్రాణాలు పోయే వరకు కొట్టడంతో పాటు పీక నులిమి చంపేశారు. అనంతరం అతడి వద్ద బంగారం, డబ్బు తస్కరించారు. ఏమీ తెలియనట్టు ఇంటికి వచ్చి కాంట్రాక్టరు భార్యను కలిసి, సార్ డబ్బు ఇవ్వమన్నారని, పోలీసుస్టేషన్‌లో ఉన్నారని చెప్పారు. దీంతో ఆమెకు అనుమానం వచ్చి.. డబ్బులు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఆమెపై దాడిచేశారు. ఆమె కేకలు వేయడంతో పారిపోయారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్ తిరుపతిరావును విచారించగా సందీప్‌ను ఎలా చంపారో తెలియజేయడంతో పాటు మృతదేహాన్ని షీలానగర్ వద్ద గల వంతెన కింద ఉంచినట్టు వివరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన పీపీ పావని నేరం రుజువు చేయడంతో ముద్దాయిలకు న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కాగా కేసును ఏఎస్‌ఐ కె.సత్యనారాయణ దర్యాప్తు చేశారు.

గోమాంసంతో కంటెయినర్ పట్టివేత: ఐదుగురిపై కేసు

నక్కపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం గో మాంసంతో ఉన్న మినీ కంటెయినర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఐదు టన్నుల గో మాంసం స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదుచేశారు. సీఐ కుమారస్వామి అందించిన వివరాల ప్రకారం...విజయనగరం జిల్లా సంతపాలెం నుంచి రాజమహేంద్రవరానికి మినీ కంటైనర్‌లో గో మాంసం తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో వేంపాడు వద్ద పోలీసులు నిఘా పెట్టారు. ఆ సమయంలో వస్తున్న మినీ కంటెయినర్‌ను తనిఖీ చేయగా సుమారు ఐదు టన్నుల గో మాంసం ఉంది. దీంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గో మాంసాన్ని పూడ్చివేశారు. దీనివిలువ సుమారు రూ.15 లక్షలు వుంటుందని అంచనా. లారీ యజమాని మణికంఠ సహా మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ, ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు.


బెయిల్‌పై విడుదలైన పరిటాల రవి హత్య కేసులో ముద్దాయి

ఆరిలోవ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో జీవిత కాలం శిక్ష అనుభవిస్తున్న రేఖమయ్య (50) శుక్రవారం బెయిల్‌పై విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదలయ్యాడు. అతడిని 2014లో నెల్లూరు జైలు నుంచి ఇక్కడికి తీసుకువచ్చారు. పరిటాల రవి హత్య 2004లో జరిగింది. ముద్దాయి రేఖమయ్య మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవాడు.

రైల్వే స్టేషన్‌లో 11 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని 11 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్‌ఐ టీఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ బి.ఆర్.బిశోయి శుక్రవారం స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సమయంలో కర్ణాటకకు చెందిన వరుణ్ గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని పేర్కొన్నారు.

ఓవరాల్ బాక్సింగ్ చాంపియన్ విశాఖ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా విశాఖ బాక్సర్లు నిలిచారు. రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచింది. పది విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించిన పదిమంది బాక్సర్లను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జనవరి 6 నుంచి 14 వరకూ పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు. విజేతలకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాసకుమార్, బహుమతులు, మెడల్స్ బహూకరించారు.